# సకల జనుల సమ్మెలో సింగరేణి ఒక పరిశీలన

పిట్టల రవీందర్












## పరిచయం

| | |
|---|---|
| పుట్టిన ఊరు (1963) | వీణవంక, కరీంనగర్ జిల్లా |
| అక్షరాభ్యాసం (1986) | డిగ్రీ వరకు గోదావరిఖనిలో ,<br>మైసూర్ యూనివర్సిటీ నుండి<br>జర్నలిజం |
| ప్రాపంచిక జ్ఞానం | సింగరేణి కోల్‌బెల్ట్ లో..... |
| వర్కింగ్ జర్నలిస్టుగా ...<br>(1982 నుండి) | రచ్చబండ, జీవగడ్డ,<br>ఉదయం, వార్త,<br>ఇండియన్ ఎక్స్‌ప్రెస్,<br>ఆంధ్రప్రభ, ప్రజాతంత్ర,<br>'చర్చ' పత్రిక ఎడిటర్ గా ... |
| జర్నలిస్టు ఉద్యమంలో...<br>(1989 నుండి2004వరకు) | ఏపియుడబ్ల్యుజె లో కరీంనగర్<br>జిల్లా ప్రధాన కార్యదర్శి,<br>జిల్లా అధ్యక్షునిగా ,<br>రాష్ట్ర ఉపాధ్యక్షునిగా,<br>రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా.... |
| గోదావరిఖని, వరంగల్లు | ప్రెస్‌క్లబ్‌లకు అధ్యక్షునిగా.... |
| తెలంగాణ ఉద్యమంలో...<br>(1996 నుండి) | తెలంగాణ విద్యావంతుల వేదికలో<br>రాష్ట్ర ఉపాధ్యక్షునిగా,<br>రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, |
| తెలంగాణ జేఏసీలో | రాష్ట్ర సమన్వయకర్తగా... |

## రచనలు

'చర్చ' సంపాదకీయాలు
'చర్చ' తెలంగాణ వ్యాసాలు
'చర్చ' సింగరేణి వ్యాసాలు
సింగరేణిలో సంస్కరణలు - ఒక పరిశీలన
సింగరేణి పరిణామాలు - పర్యవసానాలు
భూమిపుండు ( ఓపెన్‌కాస్టు గనులపై వ్యాసాల సంకలనం )
బొగ్గుపొరల్లో ... (గని కార్మికుల కవిత్వం)

# సకల జనుల సమ్మెలో సింగరేణి
# ఒక పరిశీలన

పిట్టల రవీందర్





ప్రచురణ
తెలంగాణ విద్యావంతుల వేదిక

www.eTelangana.org



అక్టోబర్ 9వ తేదీ రాత్రి " సింగరేణి యాత్ర " లో భాగంగా కొత్తగూడెం చేరుకున్న తెలంగాణ జే.ఏ.సి కో-ఆర్డినేటర్ పిట్టల రవిందర్ ను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీస్ అధికారులను అడ్డుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు



పిట్టల రవిందర్ అరెస్టు ప్రయత్నాన్ని నిరసిస్తూ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న ఉద్యమకారులు

# సకల జనుల సమ్మెలో సింగరేణి
# ఒక పరిశీలన

## పిట్టల రవీందర్



ప్రచురణ

**తెలంగాణ విద్యావంతుల వేదిక**

www.eTelangana.org

సకల జనుల సమ్మెలో సింగరేణి
ఒక పరిశీలన

పిట్టల రవీందర్

ప్రచురణ
తెలంగాణ విద్యావంతుల వేదిక

ప్రథమ ముద్రణ
డిసెంబర్, 2011

ప్రతులు: 5000

వెల: రూ.20/-

ప్రతులకు
అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలలో

ముద్రణ
విజేత గ్రాఫిక్స్ & ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
మాతంగి కాంప్లెక్స్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.
సెల్: 9394322782, 7396397913.



# మిత్రవాక్యం



**"రాజ్యాధికారాన్ని సాధించడమే**
**కార్మికవర్గ పోరాటాల అంతిమ లక్ష్యం కావాలి" – లెనిన్.**

***1984లో*** ఇంగ్లాండులో అక్కడి బొగ్గుగని కార్మికులు యేడాది పాటు నిర్వహించిన సమ్మె ప్రపంచ గని కార్మికోద్యమ చరిత్రలోనే అత్యంత కీలకమైనది. బొగ్గుగని కార్మికుల సమ్మె ప్రభావంతో ఇంగ్లాండులో మార్గరెట్ థాచర్ ప్రభుత్వం కూలిపోయింది. యునైటెడ్ మైన్ వర్కర్స్ ఆఫ్ అమెరికా (UMWA) నాయకత్వంలో అమెరికాలో జరిగిన గని కార్మికుల పోరాటాలు కూడా అనేక విజయాలను, వైఫల్యాలలను నమోదు చేసుకున్నాయి. బొగ్గు ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న చైనా దేశంలో కార్మిక సంఘాలు అక్కడి ప్రభుత్వం ఆధిపత్యంలోనే పనిచేయడంవల్ల రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేయగలిగే శక్తిని అక్కడి కార్మిక వర్గం కోల్పోయింది.

బొగ్గు ఉత్పత్తిలో ప్రపంచంలోనే మూడవస్థానంలో ఉన్న భారత దేశంలో గని కార్మికుల ఉద్యమానికి సింగరేణి బొగ్గు గని కార్మికులు నాయకత్వం స్థానంలో నిలిచారనడంలో సందేహంలేదు. దేశం మొత్తం లోని బొగ్గుగని కార్మికుల పక్షాన హక్కుల కోసం, ఆర్థిక డిమాండ్లసాధన కోసం సుధీర్ఘ సమ్మెలు నిర్వహించి, పరిష్కారాలను సాధించిన చరిత్ర సింగరేణి గని కార్మికులకున్నది. ఉత్తర తెలంగాణలో వెల్లువెత్తిన నక్సలైట్ల ఉద్యమ ప్రభావం, సింగరేణి గనికార్మికవర్గ చైతన్యం పరస్పరం ఆలంబనగా నిలిచాయి. తెలంగాణ సాయుధరైతాంగ పోరాట నేపథ్యం కూడా ఈ జమిలి ఉద్యమాలకు ప్రేరణను అందించాయి.

సింగరేణి గనికార్మికుల మూలాలు తెలంగాణ వ్యవసాయంతో ముడివడి ఉన్నాయి. సీమాంధ్ర పాలకులు అనుసరించిన వివక్ష పూరిత


www.eTelangana.org

మైన విధానాలవల్ల తెలంగాణ వ్యవసాయరంగంలో ఎదురైన సంక్షోభం, నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల అమలు నేపథ్యంలో సింగరేణిలో అమలులోకి తీసుకువచ్చిన యాంత్రీకరణ, ప్రైవేటీకరణల ఫలితంగా సంక్షోభంలో కూరుకుపోయిన గనికార్మికవర్గం ... మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ఒక పరిష్కారమార్గంగా భావించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంతకీలకమైన సకల జనుల సమ్మెలో సింగరేణి గనికార్మికులు 35రోజులు సమ్మెచేసి కీలక స్థానంలో నిలిచారు. మొత్తం దక్షిణ భారతంతోపాటు, దేశరాజధాని ఢిల్లీలోనూ సింగరేణి గనికార్మికుల సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. సింగరేణి గనికార్మికుల సమ్మెకు, తెలంగాణ రాజకీయ నాయకత్వం అండగా నిలిచిఉంటే, తమ మద్దతును ఆచరణలో అందించి ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యాంగ, రాజకీయ సంక్షోభాలు ఏక కాలంలో వచ్చిఉండేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం మరింత సుగమమై ఉండేది.

అయితే సకల జనుల సమ్మె రూపకల్పనలోనూ, కొనసాగింపులోనూ, సరైన దిశానిర్దేశాలను అందించడంలోనూ అనేకలోటుపాట్లు, వైఫల్యాలు ఉన్నప్పటికీ సమ్మె సాధించిన పాక్షిక విజయాలను విస్మరించడానికి వీలులేదు. ఇందుకు సంబంధించిన మౌలిక అంశాలను ఈ పుస్తకం ద్వారా తెలంగాణ విద్యావంతుల వేదిక 'చర్చ'కు తీసుకువస్తున్నది.

తమ జీవితాల బాగుకోసం, నిజాయితీగా పోరాడి, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా త్యాగాలు చేసిన చరిత్రే ప్రజల చరిత్ర. అందులో భాగంగానే సింగరేణి కార్మికులు ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలోనే తమకంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టుకుంటున్నారు.

సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు సకల జనుల సమ్మె పూర్వరంగంలో, నిజాయితీగా ఆత్మ విమర్శ చేసుకొని, సింగరేణి జేఏసీని పటిష్టంచేసి సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల



(ఉదా: వేజ్‌బోర్డు, ఓపెన్ కాస్టులు, ఔట్ సోర్సింగ్ సమస్యలపై) పరిష్కారం కోసం ప్రయత్నించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన దిశలో నాలుగున్నర కోట్ల మంది ఆకాంక్షలను నిజం చేసేందుకు సింగరేణి కార్మికులు సిద్ధంగానే ఉన్నారనడానికి సకల జనుల సమ్మె సందర్భంగా వారు చూపించిన ఉద్యమస్ఫూర్తి నిదర్శనం. కానీ ఉద్యమ నాయకత్వం తమ బలహీనతలను బలంగా మార్చుకొని నాయకత్వాన్ని అందించాలని సింగరేణి కార్మికులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక తమ పాత్రను నిర్వర్తించడంలో ట్రేడ్ యూనియన్లకన్నా ఒక అడుగు ముందుకు వేసి, పోరాడే కార్మికులతో మమేకమై భుజం కలిపి నడుస్తామని, నిలుస్తామని హామీఇస్తూ ఈ పుస్తకం సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికులు నిర్వహించిన వీరోచిత పోరాట పాత్రను అర్థం చేసుకోవడంలో, భవిష్యత్తు పోరాటాలను నిర్మించటానికి దోహదపడుతుందని ఆశిస్తూ... ఈ పుస్తకాన్ని తీసుకురావడంలో అహర్నిషలు శ్రమించిన మిత్రుడు పిట్టల రవీందర్‌తోపాటు మిగతా మిత్రులకు అభినందనలు తెలియజేస్తూ...

ఉద్యమాభివందనాలతో ...

- గురిజాల రవీందర్ రావు,
ఉపాధ్యక్షులు,
తెలంగాణ విద్యావంతుల వేదిక.

తేది: 13-12-2011,
మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా


www.eTelangana.org

# కృతజ్ఞతలు

కొత్తగూడెంలో నామీద జరిగిన భౌతిక దాడిని ఉద్యమ అణచివేత చర్యల్లో భాగంగా గుర్తించి, బాహాటంగా ఖండించి మనోధైర్యాన్నిచ్చిన విప్లవకవి వరవరరావుకు, ఆత్మీయ మిత్రుడు ఘంటా చక్రపాణికి, ఉద్యమ నాయకులు కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్యలకు ...

ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన తెలంగాణ రిసోర్స్ సెంటర్ పెద్దలు వేదకుమార్‌కు, జావేద్ మహ్మద్ (సింగపూర్ ఎన్.ఆర్.ఐ), తెలంగాణ డెవెలప్‌మెంట్ ఫోరం వారికి, టిడిఎఫ్ (ఇండియా ప్రతినిధి) డి.పి.రెడ్డికి, ఆత్మీయమిత్రులు ధరం గురువారెడ్డి, చొప్పరి శంకర్ ముదిరాజ్‌లకు...

అక్షరాలను పేర్చి, పేజీలను కూర్చి, పుస్తక రూపంలోకి మార్చిన గోలి సమ్మిరెడ్డికి, ఆయనతోపాటు ఆరాటపడిన బండి యాదగిరికి ...

రాష్ట్ర సాధన ఉద్యమంలో ఒకచేతితో కలాన్ని, మరోచేతిలో ఉద్యమ జెండాతో ఉరకలేస్తున్న కోల్‌బెల్ట్ జర్నలిస్టు మిత్రులకు ...

ఈ పుస్తక రచనలో అవసరమైన ముడి సరుకులను అందించి సహకరించిన హెచ్. రవీందర్, జె.వి. రాజు, కెంగెర్ల మల్లయ్యలకు...

నాతోకల్సి ప్రయాణించి కాలాన్ని కరగదీసుకున్న మిత్రులు సుధాకర్‌రెడ్డి, రామగిరి ప్రకాశ్, తదితరులకు ...

మిత్రవాక్యం రాసిచ్చిన గురిజాల రవీందర్‌రావు, స్నేహ హస్తం అందిస్తున్న సి. హెచ్. నారాయణరాజులకు ...

తెలంగాణ ఉద్యమ జ్యోతి ఆరకుండా, అలుపెరుగని రీతిలో కదంతొక్కుతున్న తెలంగాణ జేయేసి నాయకులందరికీ ...

హృదయపూర్వక కృతజ్ఞతలు

– పిట్టల రవీందర్



# సకల జనుల సమ్మెలో సింగరేణి ఒక పరిశీలన

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చెప్పినట్టుగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మూడు పార్శ్వాలు ఉంటాయి. ఒకటి భావ వ్యాప్తి, రెండవది ఉద్యమం, మూడవది రాజకీయ ప్రక్రియ. భావ వ్యాప్తి అనేది 1996 తరువాత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు, కళాకారులు, జర్న లిస్టులు అన్ని వర్గాల వారు ఈ భావ వ్యాప్తిని కొనసాగిస్తూనే ఉన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, స్వపరిపాలన లేకపోవడం వల్ల, పరాయి పాలన వల్ల, సీమాంధ్ర పెట్టుబడిదారుల వల్ల, సంపన్నవర్గాల వల్ల తెలంగాణ వనరులు ఏ విధంగా తరలిపోతున్నాయి, తెలంగాణ ఏ విధంగా నష్టపోతున్నదనే విషయాల్ని 1996 నుంచి ఇప్పటి దాక ఈ అన్నీవర్గాల వారు, తెలంగాణ మేధావులు ప్రతిభా వంతంగా, ప్రభావ వంతంగా భావవ్యాప్తిని చేయగలిగారు. రెండవది భావ వ్యాప్తి ద్వారా వచ్చిన చైతన్యం ఉద్యమంగా మారింది. 2001లో తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమ రూపాలు ఏర్పడ్డాయి. 1996లో ఒక ఆకాంక్షగా మొదలైన తెలంగాణ ఉద్యమం 2001 టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత రాజకీయ వ్యక్తీకరణ అయ్యింది, ఆ తరువాత ఒక డిమాండ్‌గా మారింది. అదే క్రమంలో టీఆర్ఎస్ ఒక రాజకీయ ప్రక్రియను ప్రారంభించిన తరువాత అది ఉద్యమంగామారింది, ఆ ఉద్యమం కూడా చాలా తీవ్రస్థాయికి వచ్చిన తరువాత 2009, డిసెంబర్ 9నాటికి ప్రజా ఉద్యమ వెల్లువగా మారింది. ఉద్యమం ప్రభావంతోనే కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనను చేయాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వంఎప్పుడైతే తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను, డిమాండ్‌ను గుర్తిస్తూ తెలంగాణ రాష్ట్రప్రకటన చేసిందో అప్పుడు అది


www.eTelangana.org

ఒక హక్కుగా మారింది. ఈ మూడు దశల ఉద్యమంలో భావ వ్యాప్తి, ఆందోళన, రాజకీయ ప్రక్రియలో మూడు మౌలికమైన, ప్రధానమైన, కీలకమైన మార్పులు సంభవించాయి. భావవ్యాప్తిగా ఉన్నప్పుడేమో ఆకాంక్షగా ఉన్నది, భావవ్యాప్తి ఫలితంగా వచ్చిన ఉద్యమం తరువాత అదొక డిమాండ్‌గా మారింది, ప్రజా ఉద్యమంతో హక్కుగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే అంశం ప్రజల ఆకాంక్షగానో, డిమాండ్‌గానో లేదు, రాజ్యాంగం ఇచ్చిన హక్కుగా మారింది. ఆ హక్కును అమలు చేయమనే ఈ రోజు డిమాండ్ చేస్తున్నాం. దానికి కూడా అనేక రూపాలలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నాం.

ప్రధానంగా 2009 నవంబర్ నుంచి 2011నవంబర్ కాలంలో ఇది మొత్తంగా ప్రజా ఉద్యమంగా కొనసాగుతుంది. ప్రపంచంలో ఎక్కడా జరుగని విధంగా 24నెలల పాటు నాలుగున్నరకోట్ల మంది ప్రజలు ప్రజాస్వామిక పద్దతుల్లో, రాజ్యాంగ బద్దంగా, శాంతియుతంగా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో రెండు ప్రధానమైన అంశాలు. మొట్ట మొదటిది సహాయ నిరాకరణ. సహాయ నిరాకరణ ఒక స్పష్టమైన లక్ష్యంతో తెలంగాణ ఏర్పాటుకు అవసరమైన రాజకీయ ప్రక్రియను ముందుకు తీసుకుపోవాలనే ఉద్దేశంతోనే సహాయ నిరాకరణ జరిగింది. కానీ 50ఏళ్ల కాలం నుంచికూడా తెలంగాణ రాజకీయ నాయకత్వం సీమాంధ్ర నాయకత్వానికి, సీమాంధ్ర ఆధిపత్యానికి బానిస భావజాలంతో పని చేస్తున్నారు. ఆ భానిస భావ జాలం నుంచి రాజకీయనాయకుల్ని బయటికి తీసుకురాకుండా, విముక్తి కలిగించకుండా స్వేచ్ఛ తీసుకు రాకుండా రాజకీయ ప్రక్రియను ముందుకు తీసుకుపోలేమనే ఉద్దేశంతోనే టీజేఏసీ సహాయ నిరాకరణ చేపట్టింది. సహాయ నిరాకరణలో మనం రాజకీయ నాయకత్వాన్ని ఉద్యమ క్రమంలోకి, ఉద్యమ పరిధిలోకి, నాయకత్వంలోకి తీసుకురావాలనుకున్నాం. కానీ అనుకోకుండా తెలంగాణ రాజకీయ నాయకత్వం ప్రజలు చూపించిన చైతన్యాన్ని అందుకుని, ప్రజల పక్షాన నిలబడి, ప్రజలతో ఉద్యమంలో నడిచి రావడానికి చొరవ చూపక పోవడం వల్ల, ధైర్యంచాలక పోవడం వల్ల, వాళ్లలో విముక్తి భావన రాకపోవడం వల్ల సహాయనిరాకరణ అర్ధాంతరంగా ముగిసింది. సహాయ నిరాకరణ



కొనసాగింపే "సకల జనుల సమ్మె". సకల జనుల సమ్మె కూడా మూడు లక్ష్యాలతో కొనసాగిద్దామనుకున్నాం. ప్రధాన లక్ష్యం తెలంగాణ రాజకీయ నాయకత్వాన్ని తెలంగాణ ఉద్యమం నాయకత్వంగా మార్చుకోవాలి, సీమాంధ్ర సంపన్న వర్గాల, రాజకీయ ఆధిపత్యం, భావజాలం నుంచి విముక్తి చేసి వారిని ప్రజా ఉద్యమంలోకి, నాయకత్వంలోకి తీసుకు రావాలనుకున్నాం. ఆ దిశగా చాలా రకాలుగా వారిపై ఒత్తిడి పెట్టాం, విశ్వాసాన్ని కూడా ఇచ్చాం. ప్రజలు అనేక రూపాల్లో ఆందోళన చేశారు. పూలు ఇచ్చారు, వారి ఇండ్ల ముందు ధర్నా చేశారు, దిష్టిబొమ్మలు తగులబెట్టారు, అదే విధంగా చావు డప్పులు మోగించారు, బతికుండగానే శవాలుగా దిష్టిబొమ్మలను ఊరేగింపు చేసినప్పటికీ కూడా వాళ్లలో ఈ సీమాంధ్ర నాయకత్వం నుంచి, బానిస బావజాలం నుంచి బయటికి రావడానికి అవసరమైన ధైర్యం మాత్రం ఉద్యమం ఇవ్వలేక పోయింది. అది ఒక లోపంగానే మనం చూసుకోవాల్సి వచ్చింది. ఇదే కాలంలో తెలంగాణలో ఉన్నటువంటి తెలంగాణపై ఆధిపత్యం చేస్తున్న సీమాంధ్ర సంపన్న వర్గాలు, పెట్టు బడిదారులుపై పోరాటం కూడా పూర్తి స్థాయిలో చేయలేక పోయాం. సహాయ నిరాకరణ కానీ సకల జనుల సమ్మె కానీ తెలంగాణ ఉద్యమంలో ఒక గొప్ప ప్రయోగంగా చూడాలి.

సకల జనుల సమ్మెలో ప్రధానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల పాత్ర చాలా కీలకమైంది.సకల జనుల సమ్మె ఎన్ని రోజులు సాగింది, ఏ మేరకు ప్రభావం చూపించింది, దాని ఫలితాలు ఏమిటి అనే చర్చ కంటే కూడా తెలంగాణ ఉద్యమాన్ని ఏకతాటిపై నిలబెట్టడానికి, ఉవ్వెత్తున లేపడానికి, శిఖరాగ్రహానికి తీసుకుపోవడానికి, సకల జనుల సమ్మె చాలా ఉపయోగపడింది. అందులో ప్రధానంగా భూమిక, భాగస్వామ్యం తెలంగాణలో ఉన్నటువంటి సింగరేణి బొగ్గుగని కార్మికులదే! సంఖ్యలో, ప్రచారంలో ఏ వర్గాలు ముందు కనిపించినా కూడా వాస్తవానికి అనేక రకాల త్యాగాలు చేసిన చరిత్ర సింగరేణి గని కార్మికులది. సింగరేణి గని కార్మికుల వల్లనే సకల జనుల సమ్మె అనేది ఇవాళ అనేక విజయాలను సాధించగలిగింది. అందులో ప్రధానమైనది ఉద్యమ శక్తులన్నింటిని కూడా ఏకతాటి మీదకి తీసుకురావడంలో గని కార్మికులు స్ఫూర్తినిచ్చారు.



www.eTelangana.org

సెప్టెంబర్ 13న మొదటి షిఫ్టులో 65వేల మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఉద్యమానికి గొప్ప ధైర్యానిచ్చింది. సమ్మెలోకి వచ్చిన మిగతా శక్తులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలందరికి కూడా అత్యంత శక్తిని, ధైర్యాన్ని ఇచ్చింది సింగరేణి కార్మికులే. సకల జనుల సమ్మె సింగరేణిని నుంచి ప్రారంభమైందని చరిత్రలో చెప్పుకోవడానికి అవకాశం ఉన్నది. ఈ వాస్తవాన్ని కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉన్నది. అదేవిధంగా సమ్మె కొనసాగింపులో కూడా ఆర్టీసీ, ఉపాధ్యాయ వర్గాల్లో కొంత ఎగుడుదిగుడు ఉన్నా సింగరేణి కార్మికులు సమ్మె విషయంలో మొదటినుంచి చిత్తశుద్ధి, తెగింపుతో పని చేస్తూ గతంలో తొమ్మిది సార్లు సమ్మె చేసి తెలంగాణ ఆకాంక్షను చాటి చెప్పారు.



# సింగరేణిలో చరిత్రాత్మక సమ్మె

ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలోనే సింగరేణి గనికార్మికోద్యమానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆ గుర్తింపు నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు నిర్వహిస్తున్న విశిష్టమైన పాత్రను పరిశీలించాలి. ఇందుకు 'సకల జనుల సమ్మె' ఒక సందర్భం మాత్రమే.

సెప్టెంబర్ 13న మొదటి షిఫ్టులో 67వేల మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఉద్యమానికి గొప్పధైర్యానిచ్చింది. సమ్మెలోకి వచ్చిన మిగతా శక్తులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలందరికి కూడా అత్యంత శక్తిని, ధైర్యాన్ని ఇచ్చింది సింగరేణి కార్మికులే. సింగరేణి గనికార్మికులు సెప్టెంబర్ 13వతేదీన మొదటిషిఫ్టులో విధులను బహిష్కరించడంతోనే సకల జనుల సమ్మె ప్రారంభమైనది. ఈ వాస్తవాన్ని కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉన్నది. అదేవిధంగా సమ్మె కొనసాగింపులో కూడా ఆర్టీసీ, ఉపాధ్యాయ వర్గాల్లో కొంత ఇబ్బందులు ఎదురైనా, సింగరేణి కార్మికుల సమ్మె విషయంలో అట్లాంటి సమస్యలు ఎదురుకాలేదు. సింగరేణి గనికార్మికులకున్న ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం కూడా ఇందుకు ప్రధాన కారణం. గని కార్మికులకున్న కార్మికవర్గ దృక్పథం, రాజకీయచైతన్యం ఇందుకు మరింతగా దోహదం చేసింది. సింగరేణి గని కార్మికులు తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండుతో గతంలోనే తొమ్మిది రోజులు సమ్మె చేసి తెలంగాణ ఆకాంక్షను చాటి చెప్పారు. సింగరేణిలో జరిగిన సమ్మె వల్ల దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో ప్రభావాన్ని చూపింది. గతంలో సుదీర్ఘ సమ్మెలు చేసిన అనుభవం సింగరేణి కార్మికులకున్నది. సకల జనుల


www.eTelangana.org

సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మె కొనసాగినంతకాలం గని కార్మికులు ప్రతిరోజూ తమ చైతన్యాన్ని అనేక రూపాల్లో ప్రతిబింబించారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలతోనూ, వ్యవసాయంతోనూ, ఆ నేపథ్యాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రతీకలతోనూ తమకున్న పేగుబంధాన్ని సమ్మెరోజుల్లో ప్రదర్శించారు. గనికార్మికుల కుటుంబ సభ్యులు కూడా సమ్మెకాలంలో తమ ఆకాంక్షలను ఉద్యమంలో భాగం చేసారు. గతంలో సింగరేణి గని కార్మికులు సమ్మెల్లోకి వెళ్లినప్పుడు కుటుంబ సభ్యులనుండి కార్మికులు ఒత్తిడిని ఎదుర్కొనేవారు. కానీ తెలంగాణ కోసం జరిగిన ఇప్పటి సమ్మెలో గని కార్మికుల కుటుంబసభ్యులు సమ్మెకాలంలో విధులకు హాజరుకావద్దని కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి చేసారు. తెలంగాణ సాధించుకునే వరకూ సమ్మెను కొనసాగించాలని ప్రోత్సహించారు. గనికార్మికకుటుంబాలలో తెలంగాణ ఆకాంక్షకు ఈ మార్పు మరో దర్పణంగా చూడాలి.

సింగరేణి గని కార్మికులు గతంలో తమ ఆర్థిక డిమాండ్ల సాధన కోసమో, హక్కుల రక్షణకోసమో, సమస్యల పరిష్కారం కోసమో దీర్ఘకాలిక సమ్మెలకు దిగిన సందర్భాలలో పౌరసమాజం నుండి గని కార్మికులు ఎదుర్కొన్న విమర్శలకు, తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా సమ్మెలోకి దిగిన సమయంలో సమాజం నుండి ఎదురైన ప్రతిస్పందనకు చాలా తేడా కనిపించింది. గతంలో సింగరేణి గని కార్మికులు దీర్ఘకాలిక సమ్మెలను నిర్వహించిన సందర్భాలలో బొగ్గుకొరతవల్ల ఎదురైన ఇబ్బందులకు సమ్మెచేస్తున్న గనికార్మికులను బాధ్యులుగా చిత్రీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించేది. ఈ కారణంగా గతంలో సింగరేణి గని కార్మికులు సమ్మె చేసిన సందర్భాలలో పౌరసమాజం నుండి వారికి సరైన మద్దతు వ్యక్తమయ్యేదికాదు. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే రాజకీయ డిమాండు కోసం సింగరేణి గని కార్మికులు తెగించి కొట్లాడిన ప్రతి సమ్మె సందర్భంలోనూ పౌరసమాజం నుండి సంపూర్ణమద్దతు లభించింది. సకల జనుల సమ్మె సందర్భంలోనూ సింగరేణి గని కార్మికుల సమ్మెకు గతంలో ఎన్నడూలేని విధంగా బయటి ప్రపంచం నుంచి, ప్రజల నుంచి మద్దతు వచ్చింది. సింగరేణి సమ్మె ప్రభావం వల్ల ఉత్పన్నమైన బొగ్గుకొరత, పర్యవసానంగా ఎదురైన కరెంటు కొరతలకు తెలంగాణ రాష్ట్ర సాధన



ఉద్యమాన్ని కారణంగా చూపాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ కారణం చూపించి రైతులను సమ్మెకు వ్యతిరేకంగా ఉసిగొల్పాలనే కుట్రలు ఉద్యమ ఉధృతిలో భగ్నమయ్యాయి.సింగరేణి గని కార్మికుల సమ్మెకు మద్దతుగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తమతమ పద్ధతుల్లో భాగస్వాములయ్యారు. ఇది సింగరేణి గని కార్మికులు సాధించిన గొప్ప విజయం. దేశ ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలో సింగరేణి బొగ్గు ఎంత కీలకమో ఈ సమ్మె తేల్చి చెప్పింది. దేశ ఆర్థికాభివృద్ధిలో సింగరేణి బొగ్గు పాత్ర ఏమిటో ప్రపంచానికి తేల్చిచెప్పింది.

ప్రజల పక్షాన రాజకీయ నాయకులు నిలబడనప్పుడు, రాజ్యాంగ సంస్థలు ప్రజల హక్కులు రక్షించడంలో విఫలమైనప్పుడు పాలన, న్యాయ వ్యవస్థలు, శాసన వ్యవస్థలు తమ విధులను రాజ్యాంగస్ఫూర్తితో నిర్వహించని సందర్భాలలో, ప్రజలే నాయకత్వం బాధ్యతలో ఉండి రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం పోరాడాల్సిన అవసరం ఉన్నదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు హక్కును అమలు చేయించుకోవడం కోసమే సకల జనుల సమ్మె ప్రారంభమైంది. సింగరేణి కార్మికుల సమ్మెకు తోడుగా మొదటిసారిగా పాలకవర్గ, విప్లవ, రాజకీయ, కార్మిక నాయకత్వంలో ఉన్న సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి సకలజనులసమ్మెలో పాల్గొనడం ఒక శుభ పరిణామం. అయితే అత్యంత భిన్నమైన ఉద్యమ నేపథ్యం కగిలిఉన్న సింగరేణి కార్మిక సంఘాలన్నీ 'ఐక్యమై' ఉద్యమంలో పాల్గొనకపోయినా, కార్యాచరణలో ఉమ్మడివేదికపై నిలచేందుకు ఉద్యమం అందరికీ ఒక ఉమ్మడి అవకాశాన్ని కల్పించింది. సమ్మెకు కార్మిక సంఘాలు కాకుండా కార్మికులే నాయకత్వం వహించారు. కార్మికులు ముందుకు వెళుతుంటే, నాయకులు వారి వెనుక వెళ్లారు. కొన్ని కార్మిక సంఘాలు సమ్మెకు ద్రోహం చేసే ప్రయత్నం చేసినప్పటికీ, గనికార్మికులు ప్రదర్శించిన అకుంఠితదీక్ష, చిత్తశుద్ధి కారణంగా వీరి ఆటలు సాగలేదు. సింగరేణి కార్మికులు సెప్టెంబర్ 13 నుండి అక్టోబర్ 17వరకు 35 రోజులపాటు వీరోచితంగా సకల జనుల సమ్మెలో పాల్గొన్న కారణంగానే కేంద్రంలో కదలిక వచ్చింది.


www.eTelangana.org

# సింగరేణి గనికార్మికోద్యమ చరిత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి, సింగరేణి గనికార్మికోద్యమానికి విడదీయరాని సంబంధం ఉన్నది. దోపిడీ, పీడన, అణచివేత పరాయిపాలనల నుండి తెలంగాణ ప్రజలు విముక్తిని కోరుకుంటున్నట్లుగానే, స్వీయ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ఆశిస్తున్నట్లుగానే సింగరేణి గనికార్మికులు కూడా ఇవే ఆకాంక్షలతో అనేక దశాబ్దాలుగా, అనేక రూపాలలో పోరాటం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనే తమ సమస్యల పరిష్కారానికి మార్గం సులభమవుతుందని ధృఢంగా విశ్వసిస్తున్నారు. 123 సంవత్సరాల సింగరేణి సుధీర్ఘ చరిత్రలో గని కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలనే ఆయుధంగా ఉపయోగించడాన్ని ఆచరిస్తూవస్తున్నారు. ఈ చారిత్రక పరంపర 1948-51 ప్రాంతంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటరోజుల నుండి కొనసాగుతున్నది. కామ్రేడ్ ధేవూరి శేషగిరి నాయకత్వంలో తెలంగాణ విముక్తి కోసం సింగరేణి గని కార్మికులు సాగించిన వీరోచిత పోరాటం, త్యాగాలకు సంబంధించిన చరిత్ర పదేళ్లక్రితం పి.చంద్ రాసిన 'శేషగిరి' నవలను 'చర్చ' దినపత్రిక సీరియల్‌గానూ, ఆ తర్వాత నవల రూపంలోనూ అందించేవరకూ తెలంగాణ సాయుధ పోరాటంలో సింగరేణి గని కార్మికులు నిర్వహించిన పాత్ర బయటి ప్రపంచానికి తెలియలేదు. ఈ కాలంలోనే సింగరేణి గని కార్మికులను ఐక్యం చేసిన శేషగిరి కార్మిక సంఘాన్ని స్థాపించాడు. 1969లో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కొత్తగూడెం పక్కనున్న పాల్వంచలో ఇక్కడి ఉద్యోగాలలో స్థానికులకే అవకాశాలు కల్పించాలని రవీంద్రనాథ్ అనే యువకుదు ఆమరణ



నిరాహార దీక్ష చేపట్టడంతోనే ప్రారంభమయ్యింది. ఆ రోజున రవీంద్రనాథ్ చేసిన ఆమరణ నిరాహారదీక్ష ఆశించిన రీతిలో ఫలితాలను సాధించి ఉంటే, ఖమ్మంజిల్లాలో వేళ్లానుకున్న సీమాంధ్ర ఉద్యోగులు, అధికారులు, కార్మికులు ఇవాళ సింగరేణి సమ్మెలో ద్రోహపూరితంగా వ్యవహరించేందుకు అవకాశాలు దక్కిఉండేవికావు. ఎనిమిది గంటల పనివిధానం కోసం 1981లో సింగరేణి గని కార్మికులు 56రోజులపాటు నిర్వహించిన సుధీర్ఘ సమ్మె ప్రపంచ గనికార్మికోద్యమ చరిత్రలోనే అత్యంత వీరోచితమైన సమ్మెగా చరిత్రకెక్కింది. ఇదే క్రమంలో ఉనికిలోకి వచ్చిన పీపుల్స్‌వార్ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) సింగరేణి గని కార్మికులను విప్లవోద్యమంలో భాగస్వాములను చేసింది. 'సికాస' నాయకత్వంలో గని కార్మికులు నిర్వహించిన అనేక పోరాటాలు అనేక చారిత్రక విజయాలను సాధించాయి.

సింగరేణి గని కార్మికులు తమ హక్కులకోసం, సమస్యల సాధన కోసమే కాకుండా సామాజిక సమస్యల పరిష్కారం కోసం కూడా ఉద్యమించిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా 1989లో 'సికాస' నాయకత్వంలో సింగరేణి గని కార్మికులు, కుటుంబాలు, ముఖ్యంగా మహిళలను నిర్వహించిన 'సారావ్యతిరేక పోరాటం' మొత్తం తెలంగాణ సమాజాన్ని ఉద్యమం వైపునకు కదిలించింది. సీమాంధ్ర ఆధిపత్య మీడియా సారా ఉద్యమాన్ని 'దూబగుంట' కేంద్రంగా చూపించి, చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నించినప్పటికీ 1989లో సింగరేణి గని కార్మికులు నిర్వహించిన 'సారావ్యతిరేక పోరాటమే' స్ఫూర్తినిచ్చిందనడంలో సంకోచం అవసరంలేదు. 1981లో 'సికాస' ఏర్పాటైన నాటినుండి 1997లో సింగరేణిలో సంస్కరణల యుగం ప్రారంభమయ్యేదాకా సింగరేణి గని కార్మికులు అనేక చారిత్రాత్మకమైన పోరాటాలకు నాయకత్వం వహించారు. దేశవ్యాపితంగా బొగ్గుగని కార్మికులకు అమలులో రావాల్సిన 4వ, 5వ, 6వ, 7వ వేజ్‌బోర్డు సిఫారసులకోసం, వాటి అమలు కోసం సింగరేణి గని కార్మికులు సాధించిన పోరాటాలు కార్మికోద్యమ చరిత్రలో నిలిచిపోతాయి. ఈ పోరాట క్రమంలో అనేక మంది విప్లవకారులు అమరులయ్యారు. వారి త్యాగాల స్ఫూర్తి వర్తమాన తెలంగాణ ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు నిర్వహిస్తున్న వీరోచిత పోరాటాలకు నేపథ్యంగా పనిచేస్తున్నది వాస్తవం.


www.eTelangana.org

సామ్రాజ్యవాద విస్తరణ, మూడవ ప్రపంచ దేశాలనుండి వనరుల దోపిడీ, గ్లోబల్ మార్కెట్ విస్తరణ తదితర లక్ష్యాలతో ప్రారంభమైన ప్రపంచీకరణ అమలు కోసం జరిగిన అణచివేత విధానాలలో సింగరేణి గని కార్మికోద్యమం అనేక ఆటుపోట్లను చవిచూసింది. 'ఒక పరిశ్రమ-ఒకే యూనియన్' నినాదంతో సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు, ఐక్య ఉద్యమవేదికను కుప్పకూల్చివేసాయి. సింగరేణి గనికార్మికవర్గం మీద మరోమారు తమ ఆధిపత్యాన్ని పునరుద్ధరించుకోవాలని ఎదురుచూస్తున్న రివిజనిస్టు, దుస్సాంప్రదాయ కార్మిక సంఘాలకు, పార్టీలకు ఈ నూతన పారిశ్రామిక విధానం ఒక వరమయ్యింది. కార్మికవర్గ నాయకత్వంలో అప్పటిదాకా సింగరేణి గని కార్మికులు సాధించుకున్న హక్కులను ఫణంగా పెట్టి, ఈ యూనియన్లు అధికారంలో వాటాలు పంచుకునే పనిలో తలమునకలయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సింగరేణిలో నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేయడం ఇటు ప్రభుత్వాలకు, అటు యాజమాన్యానికి సులభతరమయ్యింది.కార్మికులు ఎంతోకాలంగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులన్నీ ఒక్కొక్కటిగా హరించుకుపోయాయి. డిపెండెంట్ ఉద్యోగ అవకాశాన్ని రద్దు చేసారు. నిబంధనలను సాకుగా చూపి వేలాదిమంది యువకులైన కార్మికులను 'డిస్మిస్' చేసారు. సింగరేణిలో ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. స్వచ్ఛంద పదవీ విరమణపేరిట 24సార్లు అమలు జరిపిన ' గోల్డెన్ హ్యాండ్ షేక్'తో దాదాపు 50వేల మంది కార్మికులను బలవంతంగా ఇంటి దారిపట్టించారు. సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించే నెపంతో లక్షలాది కార్మిక కుటుంబాలను సామాజిక సంక్షోభంలోకి నెట్టివేసారు. సింగరేణి చుట్టూ పెనవేసుకున్న సామాజిక జీవన వ్యవస్థలు కుప్పకూలాయి. లక్షలాది మంది ఉపాధిని కోల్పోయి నిరాశ్రయులయ్యారు. తెలంగాణ జీవన చిత్రానికి, సంస్కృతికి, సహజీవనానికి, ఉమ్మడి వ్యక్తీకరణకు ప్రతీకగా నిలిచిన సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాలు కళావిహీనంగా మారిపోయాయి. కేవలం పది సంవత్సరాల సంస్కరణల అమలు కాలంలోనే కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని బతుకు చిత్రం ఛిద్రమైపోయింది.



# తెలంగాణ ప్రజా ఉద్యమంలో సింగరేణి నేపథ్యం

ప్రపంచీకరణ నేపథ్యంలో అమలులోకి తెచ్చిన సంస్కరణలు సృష్టించిన సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, అందులోనుండి సురక్షితంగా బయటకు రావడానికి సింగరేణి గని కార్మిక కుటుంబాలు దారులు వెతకడం ప్రారంభమయ్యింది. ఈ సంధికాలంలోనే ప్రభుత్వాలు నూతన పారిశ్రామిక విధానాలకు సింగరేణి బొగ్గుగనుల సంస్థను ఒక ప్రయోగశాలగా ఎంచుకున్నాయి. సింగరేణిలో ఆధునీకరణ, యాంత్రీకరణ, ప్రైవేటీకరణలను ప్రవేశపెట్టాయి. ఓపెన్‌కాస్ట్ గనులను పెద్దయెత్తున ప్రారంభించాయి. ఔట్‌సోర్సింగ్ విధానాలను అమలు జరిపి అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లోనూ టెంపరరీ కార్మికులను దింపారు. ఓవెర్‌బర్డెన్ (మట్టి తొలగించేపనులను) కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులవల్ల కోల్‌బెల్ట్ ప్రాంతాలకు చెందిన వ్యవసాయం కుంటుపడింది. వేలాదిఎకరాల భూములు బలవంతంగానూ, ప్రలోభాలతోనూ గుంజుకున్నారు. లక్షలాదిమంది విస్థాపనకు గురయ్యారు. నష్టపరిహారాలు, పునరావాసాలు అందనిద్రాక్షలయ్యాయి. సింగరేణి చుట్టూ అల్లుకున్న సామాజిక వ్యవస్థలుకూడా అతలాకుతలమయ్యాయి. వ్యవసాయం కుంటుపడటంతో, ఈ రంగంమీద ఆధారపడిన వేలాదికుటుంబాలు సింగరేణి సృష్టించిన సంక్షోభంలో కూరుకుపోయాయి. ఫలితంగా సింగరేణిలోనూ, సింగరేణి బొగ్గుగనుల చుట్టూ ఉన్న సామాజిక వ్యవస్థలన్నీ తాము ఎదుర్కొంటున్న సంక్షోభాలనుండి బయటపడే మార్గాలకోసం, తాము ఎదుర్కొంటున్న సమస్యలనుండి బయటపడవేసే అవకాశాలకోసం, తమకు అండగా నిలిచే శక్తులకోసం ఎదురుచూసారు.


www.eTelangana.org

సింగరేణి సంస్కరణలు సృష్టిస్తున్న సంక్షోభాల నుండి గనికార్మిక వర్గాన్ని కాపాడే విషయంలో ఇక్కడి కార్మిక సంఘాలు ఎలాంటి ప్రయత్నాలకూ పూనుకోలేదు. బాధితులను రక్షించడం అటుంచి కనీసం వారిని ఓదార్చే ప్రయత్నాలు కూడా జరుగలేదు. సింగరేణి కోల్‌బెల్ట్‌లోనూ, చుట్టూ పరిసరాల్లోనూ విధ్వంసం సృష్టిస్తున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను కొన్ని కార్మిక సంఘాలు నిస్సిగ్గుగా బాహాటంగానే సమర్థించాయి. ప్రభుత్వాలకు, యాజమాన్యాలకు, కాంట్రాక్టర్లకు అన్నివిధాలుగా సహకరించాయి. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ విధానాలను వ్యతిరేకించే వ్యక్తులను, సంస్థలను అభివృద్ధి నిరోధకులుగా చిత్రీకరించాయి. 'సేవ్ సింగరేణి', మానవ హక్కుల వేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక లాంటి సంస్థలు ఈ సంక్షోభ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు, దీనికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించేందుకు, ఉద్యమాలను నిర్మించేందుకు అనేక ప్రయత్నాలను ప్రారంభించాయి. ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ సృష్టిస్తున్న విధ్వంసాలను బయటి ప్రపంచానికి తెలియజెప్పడంలోనూ, స్థానికులను సమీకరించడంలోనూ 'తెలంగాణ విద్యావంతుల వేదిక' విశేషంగా కృషిచేసింది. కోలెబెల్ట్ ప్రాంతాలలో వందలాది సదస్సులను, సభలను, రౌండ్‌టేబుల్ మీటింగులను తెలంగాణ విద్యావంతుల వేదిక నిర్వహించింది. సింగరేణి సంస్కరణలు, సింగరేణి పరిణామాలు-పర్యవసానాలు, సింగరేణి వ్యాసాలు, భూమిపొరల్లో ... లాంటి అనేక పుస్తకాలను ప్రచురించింది. ప్రత్యేకంగా ఓపెన్‌కాస్ట్ గనుల విధ్వంసాన్ని బయటి ప్రపంచానికి తెలియజెప్పేందుకు 'మీడియా టూర్' నిర్వహించి, ఈ అధ్యయనంతో 'భూమిపుండు' అనే పుస్తకాన్ని ఓపెన్‌కాస్ట్‌లపై తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రత్యేకంగా వెలువరించింది. 2008 అక్టోబర్‌లో 'తెలంగాణ విద్యావంతుల వేదిక' నిర్వహించిన 'కాలరీ కవాతు' కార్యక్రమం గనికార్మిక కుటుంబాలలో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేసింది.

వరుస సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న కోల్‌బెల్ట్ సమాజం 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు ఒక బలమైన రాజకీయ గొంతు లభించడంతో కొంత ఊరటను పొందింది. సీమాంధ్ర ఆధిపత్య రాజకీయాలవల్ల, వలస



పాలకులవల్లనే తెలంగాణ ప్రాంత ప్రజలు అనేక సమస్యలను దీర్ఘకాలికంగా ఎదుర్కోవాల్సివస్తున్నదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా మాత్రమే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం వెతుక్కునేందుకు అవకాశాలు మెరుగుపడతాయని, వనరుల దోపిడీని అడ్డుకోవడంద్వారా మాత్రమే ఇక్కడ అభివృద్ధి సాధ్యమని, సింగరేణి ప్రాంత సమస్యలు సైతం ఇందులో భాగమేనని... రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా తెలంగాణ విద్యావంతుల వేదిక కోల్‌బెల్ట్ ప్రాంతాలలో విస్తారంగా నిర్వహించిన భావవ్యాప్తి సింగరేణి గనికార్మికవర్గంలో కొంత మనోధైర్యాన్ని నింపగలిగింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సింగరేణి గని కార్మికులు చేదోడుగా నిలిచారు. ఉద్యమంలో చురుకైన పాత్రను నిర్వహించారు. తెలంగాణ పారిశ్రామిక రంగ కార్మికులకు సింగరేణి గని కార్మికులు తెలంగాణ ఉద్యమదారిని చూపించారు.

ఉద్యమంలోని ప్రతిసందర్భంలోనూ సింగరేణి గని కార్మికులు క్రియాశీలకంగా స్పందించారు. సకల జనుల సమ్మెకు పూర్వమే సింగరేణి గని కార్మికులు దాదాపు 9 రోజులపాటు సమ్మె చేసారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, తదితర వర్గాలు సమ్మె తర్వాత ఏదో ఒక రూపంలో వేతనాలు పొందినప్పటికీ (సహాయ నిరాకరణ సందర్భంలో) సింగరేణి గని కార్మికులు మాత్రం సమ్మెకాలంలో వేతనాల గురించి ఆలోచించకుండా 'ఉద్యమ స్ఫూర్తి' ని ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు ఆమరణ దీక్షకు కూర్చున్న సందర్భంగా, ఆయన దీక్షకు మద్దతుగా 2009 నవంబర్ 30వతేదీన సింగరేణి కార్మికులు ఒకరోజు సంఘీభావంగా సమ్మె చేసారు. దీక్షలో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన చేయాలని, దీక్షను విరమింపజేయాలని డిమాండు చేస్తూ డిసెంబర్ 7వ తేదీనాడు మరోమారు సమ్మె చేసారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైయ్యిందని 2009 డిసెంబర్ 9వతేదీనాడు కేంద్రమంత్రి చిదంబరం చేసిన ప్రకటనకు వ్యతిరేకంగా సీమాంధ్ర రాజకీయ నాయకత్వం ఆడిన రాజీనామా డ్రామాల నేపథ్యంలో 2009 డిసెంబర్ 23వతేదీనాడు చిదంబరం చేసిన



www.eTelangana.org

మరోప్రకటనకు నిరసనగా సింగరేణి గని కార్మికులు డిసెంబర్ 24, 25తేదీలలో రెండు రోజులపాటు స్వచ్ఛందంగా సమ్మె చేసారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండును పరిష్కరించకుండా, కాలయాపన కోసం కేంద్రప్రభుత్వం శ్రీకృష్ణకమిటీని నియమించడాన్ని కూడా సింగరేణి గని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. శ్రీకృష్ణకమిటీ నియాకానికి నిరసనగా కమిటీ సభ్యులు మొదటిసారి హైదరాబాద్ సందర్శిస్తున్న సందర్భంగా 2010 మార్చి 4తేదీన గనికార్మికులు మరోసారి సింగరేణిలో సమ్మె సైరన్ మోగించారు. తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటీ (తెలంగాణ జేయేసి) ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ డిమాండు కోసం తిరిగి 2011 ఫిబ్రవరి 22,23 తేదీలలో రెండురోజులు సింగరేణి గని కార్మికులు సమ్మె చేసారు. ఆ తర్వాత తెలంగాణ ప్రజాప్రతినిధులందరూ తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండు చేస్తూ 2011 జూలై 5,6 తేదీలలో మరో రెండురోజులు సింగరేణిలో కార్మికులు సమ్మె చేసారు. ఇట్లా తెలంగాణ ప్రజా ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు తమ ఉనికిని నిలబెట్టుకుంటున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితేనే తమ సమస్యలకు, సింగరేణి సంస్థ మనుగడకు భవిష్యత్తు ఉంటుందని సింగరేణి గని కార్మికులు గాఢంగా నమ్ముతున్నారు. అందుకోసం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎట్లాంటి త్యాగాలకైనా సదా సిద్ధమని ప్రతి సందర్భంలోనూ పదేపదే నిజాయితీగా ప్రకటిస్తున్నారు.



# నిరసన దశనుండి ప్రతిఘటన రూపంలోకి...

గడచిన రెండు సంవత్సరాలుగా నిరంతరంగా 'నిరసన రూపం'లో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం 'ప్రతిఘటన రూపం'లోకి మారుతున్న సూచనలను కూడా సింగరేణి గని కార్మికుల సమ్మె స్పష్టం చేసింది. గతంలో అనేక సందర్భాలలో సింగరేణి గని కార్మికవర్గం నిర్వహించిన వీరోచిత పోరాటాలను అణచివేయడంలో సాయుధ పోలీసు బలగాలను ప్రయోగించిన అనుభవం ప్రభుత్వాలకు, సింగరేణి యాజమాన్యానికి ఉన్నది. అయితే ఇట్లాంటి ప్రయత్నాలు ఎదిరించడంలోనూ సింగరేణి గని కార్మికులకు కూడా ఉన్నది. సకల జనుల సమ్మె సందర్భంలోనూ సింగరేణి కార్మికుల సమ్మెను సాయుధబలగాలతో విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో సింగరేణి గని కార్మికులు ప్రదర్శించిన తెగింపు, ధైర్యసాహసాలముందు ప్రభుత్వ ఎత్తుగడలు పనిచేయలేదు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా పోలీసు యంత్రాంగం సహకారంతో గోదావరిఖని ప్రాంతంలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు పోలీసు బలగాలు చేసిన ప్రయత్నాలను కార్మికులు, కొన్ని కార్మిక సంఘాలు, ఉద్యమకారులు వీరోచితమైన పాత్రను నిర్వహించారు. కోల్‌బెల్ట్ కార్మిక వాడల్లో సాయుధ పోలీసులు ప్రవేశించి, కార్మిక కుటుంబాలను భయాందోళనలు సృష్టించి, కార్మికులను బలవంతంగా పోలీసువాహనాలోకి ఎక్కించి, గనుల్లోకి దించడానికి అనేక రకాలుగా ప్రయత్నించారు. అయితే ఈ ప్రయత్నాలను కొంతమంది సాహసులైన ఉద్యమకారులు, జర్నలిస్టులు వీరోచితంగా అడ్డుకుని పోలీసుల చెరనుండి, ఓపెన్‌కాస్ట్ గనులనుండి విజయవంతంగా విడిపించుకుని, గని కార్మికుల


www.eTelangana.org

ఉద్యమానికి ఊపిరులూదారు. కొత్తగూడెం ప్రాంతంలో రుద్రంపూర్ జేయేసీ నాయకులు కూడా ఇట్లాంటి సాహసాలను ప్రదర్శించారు. తెలంగాణ ఉద్యమ క్రమంలో నిరసన నుండి ప్రతిఘటన రూపానికి బీజాలు ఇక్కడే పడ్డాయి. ఈ క్రమంలో ప్రజలపట్ల, ప్రజాఉద్యమాలపట్ల బాధ్యత కలిగిన కోల్‌బెల్ట్ జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమ సందర్భంలో నిర్వహిస్తున్న పాత్ర అత్యంత ప్రశంసనీయమైనది.

నవంబర్ 9వ తేదీనాడు తెలంగాణ జేయేసి చేపట్టిన 'సింగరేణి యాత్ర'ను విఫలం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రస్థాయిలో ప్రయత్నించాయి. అప్పటికే సింగరేణి సమ్మె ప్రభావంతో అతలాకుతలమవుతున్న అనేక రాష్ట్రాల నుండి కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నది. దక్షిణాదిరాష్ట్రాలతోపాటు దేశరాజధాని ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలలోని ఆధిపత్య పారిశ్రామిక వర్గాలు సింగరేణి సమ్మె ఫలితంగా తీవ్రమైన సంక్షోభపరిస్థితులను ఎదుర్కొన్నాయి. విదేశాలనుండి బొగ్గును దిగుమతి చేసుకోవడం ద్వారా ఈ సంక్షోభం నుండి పారిశ్రామిక వర్గాలను గట్టెక్కించాలనే ప్రయత్నాలు ఫలించలేదు. తెలంగాణ జేయేసి మూడు రోజుల 'రైల్‌రోకో' కార్యక్రమం జేయేసి అనుసరించిన 'వాయిదా' వ్యూహం వల్ల ఆరురోజులపాటు కొనసాగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ జేయేసీ నాయకత్వం చేపట్టిన 'సింగరేణి యాత్ర'ను అడ్డుకోని పక్షంలో ఖమ్మం జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలలోనూ సింగరేణి సమ్మె మరింత తీవ్రరూపం దాల్చుతుందని ప్రభుత్వాలు అంచనా వేసాయి. జేయేసీ చైర్మెన్ కోదండరామ్ నాయకత్వంలో ఒక బృందం ఖమ్మంజిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతానికి, జేయేసీ కో-చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య నాయకత్వంలో మరో బృందం కరీంనగర్ జిల్లా గోదావరిఖని ప్రాంతానికి, జేయేసి కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్ నాయకత్వంలో మూడవ బృందం ఆదిలాబాద్ జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలను పర్యటించాలని నిర్ణయించాము. నవంబర్ 9వ తేదీ ఉదయం రాష్ట్ర జేయేసి కార్యాలయం నుండి యాత్ర ప్రారంభమయ్యే సమయానికే ప్రభుత్వం పెద్దసంఖ్యలో పోలీసులను దింపింది. హైదరాబాద్‌లోనే 'సింగరేణి యాత్ర'ను అడ్డుకుంటారనే అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, కోల్‌బెల్ట్ శివారు ప్రాంతాలలో ఈ మూడు బృందాలను అరెస్టు



చేస్తారనే సమాచారం మాకు అందింది. ఇందుకోసం ప్రభుత్వం దాదాపు తొమ్మిది ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దిగినట్లు కూడా సమాచారం అందింది. 'సింగరేణి యాత్ర'పట్ల సింగరేణి ప్రాంతాలలో వ్యక్తమవుతున్న ఆసక్తిని గమనించిన ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుని మొదటగా ఆలేరువద్ద కోదండరామ్‌ను అరెస్టు చేసారు. కోదండరామ్ అరెస్టు సమాచారం అందుకున్న మేము, మిగిలిన రెండు బృందాలలో ఒకటి గోదావరిఖనికి, మరొకటి కొత్తగూడెం చేరుకోవాలని నిర్ణయించుకున్నాము. జేయేసీ చైర్మెన్ కోదండరామ్‌ను అరెస్టు చేసిన ఆలేరు పోలీసులు ఆయన ఒక్కడినే జీపులో ఎక్కించుకుని పట్టణంలో తిప్పడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అప్పటికే అరెస్టు సమాచారం అందుకున్న స్థానిక జేయేసీ నాయకులు, ఉద్యమ ప్రజలు, విద్యార్థులు, యువకులు వందల సంఖ్యలో ఆలేరు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దాదాపు మూడు గంటలపాటు ఆట, పాటలతో రోడ్డుపైనే ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో పోలీసుల వ్యూహాన్ని తప్పించుకుని గోదావరిఖనికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్న మల్లేపల్లి లక్ష్మయ్య బృందాన్ని సిరిసిల్ల శివారులో అరెస్టు చేసారు. ప్రతిక్రియగా వేలాదిమంది ఉద్యమకారులు, విద్యార్థులు, జేయేసి నాయకులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ముందు అనేక గంటలపాటు బైఠాయింపు జరిపారు. కొందరు విద్యార్థులు అరెస్టులకు నిరసనగా టవర్లు ఎక్కారు. ఇదే సమయంలో జేయేసి కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్ నాయకత్వంలోని మూడవ బృందం ఆధ్వర్యంలో 'సింగరేణి యాత్ర' పోలీసుల వ్యూహాలను ఛేదించుకుని, దాదాపు ఆరు గంటలపాటు గ్రామీణ రోడ్లద్వారా ప్రయాణించి కొత్తగూడెం పట్టణం చేరుకున్నది. 'శేషగిరి' భవనంలో సమావేశం పూర్తి చేసుకుంటున్న సమయంలోనే పిట్టల రవీందర్‌ను అరెస్టు చేయడానికి విఫలయత్నం చేసాయి. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకత్వంలో ఎఐటీయుసి నాయకులు, కార్యకర్తలు, జేయేసి నాయకులు, ఉద్యమకారులు వందల సంఖ్యలో పోలీసుల ప్రయత్నాలను ప్రతిఘటించారు. అరెస్టులను అడ్డుకున్నారు. స్థానిక డిఎస్పీ నాయకత్వంలో అదనపు బలగాలను 'శేషగిరి' భవనం వద్ద మోహరించి అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు


www.eTelangana.org

ప్రయత్నించారు. ఇదే సమయంలో చుట్టుపక్కలనుండి వందలాదిమంది కార్మికులు, యువకులు అక్కడికి చేరుకుని పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించారు. జేయేసీ నాయకులను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని డిమాండు చేసారు. అకారణంగా అరెస్టు చేస్తే ప్రతిఘటిస్తామని, ఎదురుదాడి చేస్తామని హెచ్చరించారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పోలీసు అధికారులు మెజిస్ట్రేట్ ఉత్తర్వులతో మళ్లీ శేషగిరి భవనాన్ని చుట్టుముట్టారు. పిట్టల రవీందర్‌ను మూడు రోజులపాటు (అక్టోబర్ 9, 10, 11 తేదీలలో) కొత్తగూడెం డివిజన్‌లో పర్యటించకుండా, పట్టణంలోకి ప్రవేశించకుండా 'నిషేధిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. (ఒక ఉద్యమ నాయకున్ని పట్టణానికి రాకుండా నిషేధాజ్ఞలు విధించడం ఐదుదశాబ్దాల తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఇదే మొదటిసారి). ఈ ఉత్తర్వులకు నిరసనగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకత్వంలో వందలాదిమంది కార్యకర్తలు, ఉద్యమకారులు శేషగిరి భవనం నుండి కొత్తగూడెం పోలీస్‌స్టేషన్ వరకు అర్ధరాత్రి 1.30 గంటలకు ఊరేగింపును నిర్వహించి, పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. చివరకు స్థానిక డియస్పీ క్షమాపణ చెప్పడంతో జేయేసీ నాయకులను హైదరాబాద్‌కు తరిలించారు. ఈ సంఘటనకు నిరసనగా మరునాడు కొత్తగూడెంలో 'బంద్' నిర్వహించారు.

కాకతాళీయంగా చోటుచేసుకున్న పై మూడు ప్రజాప్రతిఘటనకు సంబంధించిన సంఘటనల్లోనూ ఉద్యమ శ్రేణులు స్వచ్ఛందంగానే స్పందించి, పాల్గొన్నారు. వారిని రాజకీయపార్టీలుగానీ, సంస్థలుగానీ ప్రత్యేకంగా సమీకరించలేదు.

రెండు సంవత్సరాల తెలంగాణ ప్రజాఉద్యమం 'నిరసన' రూపం నుండి 'ప్రతిఘటన' రూపంలోకి మారుతున్న క్రమానికి 'సింగరేణి యాత్ర' సందర్భంగా జరిగిన ఈ మూడు ప్రజాప్రతిఘటన సంఘటనలను ప్రారంభసూచికలుగా చూడవలసి ఉన్నది. భవిష్యత్తు ప్రజాఉద్యమాన్ని 'ప్రజాప్రతిఘటన' రూపంలోకి రూపుమార్చవలసిన ఆవశ్యకతను, ఆ దిశలో తెలంగాణ ఉద్యమ ప్రజానీకం ప్రదర్శిస్తున్న సంసిద్ధతను 'సింగరేణి యాత్ర' వెల్లడించింది.



# అణచివేతలో అధికారుల పాత్ర

ఫ్యూడల్ అణచివేత పద్ధతులకు, గ్లోబలైజేషన్ నేపథ్యంలో ప్రపంచ వ్యాపితంగా అమలు జరుగుతున్న సామ్రాజ్యవాద పెట్టుబడీదారి అణచివేతలకు రూపంలోనూ, సారంలోనూ భూమ్యాకాశాలమధ్యనున్నంత తేడాలున్నాయి. గడచిన రెండు సంవత్సరాల ప్రజా ఉద్యమాల సందర్భంలో ప్రధాన ఘట్టాలుగా పేర్కొనదగిన సహాయ నిరాకరణ, సకల జనుల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వాలు అనుసరించిన వ్యూహాలను పసిగట్టడంలోనూ, ఎదుర్కోవడంలోనూ తెలంగాణ జేయేసి సాంప్రదాయ వ్యూహాలను, ఫ్యూడల్ అణచివేతను ఎదుర్కునే అనుభవం నుండి వచ్చిన పద్ధతులకు సంబంధించిన ఎత్తుగడలను అనుసరించడంవల్ల ఈ రెండు సందర్భాలలోనూ సమ్మె విరమణలను నిలువరించలేకపోయింది. అయితే సమ్మెకాలంలో, సమ్మెకు వెలుపల ఉన్న ఉద్యమ శ్రేణుల్లో సమ్మెప్రభావంతో పెల్లుబికిన భావోద్వేగాలను భవిష్యత్తు ఉద్యమానికి అనుసంధానం చేయడంలో తెలంగాణ జేయేసీ ఎంతో వ్యూహాత్మకంగా సిద్ధం చేసిన కార్యాచరణకు 'తెలంగాణ రాజకీయ నాయకత్వం' తన ఆధిపత్యభావజాల ప్రదర్శణకోసం, పట్టుకోసం నాశనం చేసింది. ఈ కుట్రలను సహాయ నిరాకరణ విరమణ సందర్భంలో 'మిలియన్ మార్చ్'లాంటి కార్యక్రమంతో భగ్నం చేయగలిగినప్పటికీ,సకల జనుల సమ్మెకు ప్రత్యామ్నాయ ఉద్యమ రూపాన్ని (తెలంగాణ మార్చ్) అమలు చేయడంలో తెలంగాణ జేయేసి ఫలితం సాధించలేకపోయింది. (సహాయ నిరాకరణ సందర్భంగా ఎదురైన చేదు అనుభవంతో 'తెలంగాణ రాజకీయ నాయకత్వం' అమలు జరిపిన పకడ్బందీ ప్రణాళికల ఫలితంగా...) జేయేసీని నియంత్రించాలనే ప్రయత్నంలో భాగంగా రాజకీయ


www.eTelangana.org

ఆధిపత్యం అమలుజరుపుతున్న విధానాలు ఇందుకు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

తెలంగాణ ఉద్యమం ఇచ్చిన ఆలంబనతో మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే రాజకీయ డిమాండు కోసం ఆర్టీసీ సమ్మె కట్టింది. ఉద్యమం సృష్టించిన అనివార్యత ఫలితంగానే ఉపాధ్యాయులు సైతం తమను పెనవేసుకున్న సీమాంధ్ర మూలాలను తెంచుకుని ఉద్యమ పథంలోకి రావాల్సిన పరిస్థితి ఎదురయ్యింది. ఆర్టీసీ, ఉపాధ్యాయసంఘాల సమ్మెలను విచ్ఛిన్నం చేయడంలో ప్రభుత్వం పెట్టుబడీదారి స్వభావంతో కూడిన ఆధునిక అణచివేత పద్ధతులను అనుసరించింది. సీమాంధ్ర ఆధిపత్య నాయకత్వాలను ఇందుకు పావులుగా వాడుకున్నారు. ఇదే పద్ధతులను సింగరేణి సమ్మె విచ్ఛిన్నానికి కూడా ప్రభుత్వం అమలు చేసింది. సమ్మెకాలంలో ఒక్కరోజు పనిచేస్తే నాలుగు మస్టర్లు ఆశచూపడం, సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు పండగ అడ్వాన్సులు చెల్లించబోమని బ్లాక్‌మెయిల్ చేయడం, సింగరేణిలోని సీమాంధ్ర ప్రాంతాలకు చెందిన అధికారులు అనుసరించిన ద్రోహపూరితమైన పాత్ర, ప్రభుత్వం అమలు జరిగిన దమననీతి, అక్రమ అరెస్టులు, కార్మికులపై వేధింపు చర్యలు, పోలీసు కేసులులాంటి చర్యలను సింగరేణి యాజమాన్యం అత్యంత పకడ్బందీ వ్యూహంతోనూ, పెట్టుబడీదారి ఎత్తుగడలతోనూ అమలు జరిపింది. వీటిని ఎదుర్కోవడంలోనూ, తిప్పికొట్టడంలోనూ (ఖమ్మం జిల్లాకు సంబంధించి నంతవరకు) సింగరేణిలోని కార్మిక సంఘాలు 'బుద్ధిపూర్వకంగానే' నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. అయితే వీరి ఎత్తుగడలు ఉద్యమ స్ఫూర్తిని నింపుకున్న కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్లు జిల్లాల కోల్‌బెల్ట్ ప్రాంతాలలో ఫలించలేదు.

మరోవైపున తెలంగాణ ప్రాంతీయతను అడ్డుపెట్టుకుని అవకాశం దొరికిన ప్రతిసందర్భంలోనూ వక్తిగత లబ్దికోసం ప్రయత్నించే కొంతమంది సింగరేణి అధికారులు (సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ బి. రమేష్‌కుమార్, ఛీఫ్ జనరల్ మేనేజర్లు -మాదాసు మల్లేశం, ఏ. మనోహర్‌రావు (కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుకు అల్లుడు), ఆంథోనిరాజా, సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం. ఎస్. వెంకట్రామయ్య,



జనరల్ మేనేజర్ విజయారావు, లాంటివారు) సమ్మె విచ్ఛిన్నానికి అమలుజరిపిన కుట్రలో ప్రధాన సూత్రధారులుగా పనిచేసనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

సకలజనుల సమ్మెలో అగ్రభాగాన నిలిచిన సింగరేణి గని కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడంలో సింగరేణి అధికారుల సంఘం నిర్వహించిన పాత్ర అత్యంత కుట్రపూరితమైనది. ద్రోహపూరితమైనది. సింగరేణి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి సింగరేణి అధికారులు అనేక రకాలుగా కార్మిక చట్టాలను, గనుల రక్షణ సూత్రాలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. అత్యవసర సర్వీసుల పేరుతో, గనుల రక్షణ నిబంధనల పేరుతో సమ్మె విచ్ఛిన్నానికి దారులు వెతికారు. సమ్మెకాలంలో ఉద్యమ విఘాతానికి పాల్పడిన కార్మికులకు, ఉద్యమం కోసం త్యాగాలు చేస్తున్న కార్మికుల మధ్యన విభేదాలను సృష్టించేందుకు అనేక రకాలైన ఎత్తుగడలను, కుట్రలను అధికారులు అమలు జరిపారు. వీరి మధ్యన మానసిక సంఘర్షణను నెలకొల్పేందుకు ప్రయత్నించారు. ఆర్థిక ప్రయోజనాలు ఎరగా చూపారు. 'దసరా' పండుగ సెంటిమెంటును సైతం వాడుకునేందుకు ప్రయత్నించారు.

తెలంగాణ ఉద్యమానికి తాము అనుకూలమని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తాము కూడా సహకరిస్తామని, ఉద్యమంలో తమవంతు పాత్రను పోషిస్తామని, ఉద్యమంలో తాము కూడా భాగస్వాములుగా పాల్గొంటామని గతంలో అనేకసార్లు ఆర్భాటంగా ప్రకటించిన సింగరేణి అధికారుల సంఘం, అసలు యుద్ధం ప్రారంభమయ్యే సమయానికి వెన్నుచూపి పారిపోయింది. ఉద్యమ ద్రోహానికి నడుంకట్టింది. ఉద్యమంలో తన నిజస్వరూపాన్ని ప్రదర్శించింది. సింగరేణి సమ్మెలో అధికారుల సంఘంకూడా పాల్గొనిఉంటే పరిస్థితులు మరింత భిన్నంగా ఉండేవి. గతంలో రాజీనామాల విషయంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన తెలంగాణ ప్రాంత నాయకత్వం అనుసరించిన మోసపూరిత పద్ధతులనే సింగరేణి సమ్మె సందర్భంలో సింగరేణి అధికారుల సంఘం కూడా అనుసరించి, తెలంగాణ ఉద్యమంలో నమ్మకద్రోహానికి పాల్పడింది.



www.eTelangana.org

# కార్మిక సంఘాలపాత్ర

సకల జనుల సమ్మెలాంటి కీలకమైన సందర్భాలలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించవలసిన సింగరేణిలోని కార్మిక సంఘాలు, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో రాజకీయంగా లబ్దిపొందేందుకు అవసరమైన ఎత్తుగడలనూ లోపాయికారీ పద్ధతుల్లో అమలుజరిపాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు తమ ఉనికిని ప్రదర్శించడానికి ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ ఇక్కడి సీమాంధ్ర ఆధిపత్య నాయకత్వంలోని కార్మిక సంఘాలు కార్మిక వ్యతిరేకవైఖరులనే ప్రదర్శించాయి. గడచిన రెండు సంవత్సరాల (నవంబర్ 2009 నుండి ఇప్పటివరకు) తెలంగాణ ప్రజా ఉద్యమంలో సింగరేణి గని కార్మికులు అతికీలకమైన ఆరు సందర్భాలలో తొమ్మిది రోజులపాటు సమ్మెచేస్తే ఈ కార్మిక సంఘాలు ఏ ఒక్క సందర్భంలోనూ కార్మికుల సమ్మెలను సమర్థించలేదు. ఇట్లాంటి చాలా సందర్భాలలో ఈ సంఘాలు కార్మికుల సమ్మెలను వ్యతిరేకించాయి. సమ్మెకు వ్యతిరేకంగా బొగ్గుగనుల మీద మీటింగులుపెట్టి ప్రచారం నిర్వహించాయి. మీడియా మీటింగులుపెట్టి సమ్మెను వ్యతిరేకిస్తూ బాహాటంగానే ప్రకటనలు చేసారు. సమ్మెను బలపరుస్తున్న సంఘాలపై విమర్శలు గుప్పించారు. వాల్‌పోస్టర్లు వేసారు. కరపత్రాలు పంచారు. సమ్మె చేస్తున్న కార్మికుల్లో విబేధాలు సృష్టించేందుకు అన్ని మార్గాలను అనుసరించారు. తెలంగాణ జేయేసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సింగరేణి జేయేసీ'లో ఈ కార్మిక సంఘాలు భాగం కాలేదు.



సింగరేణి జేయేసి ఏర్పాటు చేయడంలోనూ, ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులను సమీకరించడంలోనూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిజిబికెఎస్), సిపిఐ-ఎం.ఎల్. (న్యూడెమోక్రసీ)కి అనుబంధంగా పనిచేస్తున్న ఐ.ఎఫ్.టి.యు. కార్మిక సంఘాలు, హెచ్.ఎం.ఎస్ కార్మిక సంఘాలు ముందుండి పనిచేస్తున్నాయి. సకల జనుల సమ్మెకు ముందుకాలంలో జరిగిన తొమ్మిది రోజుల సమ్మె సమయంలోనూ,35రోజుల సింగరేణి సమ్మెలోనూ ప్రధానంగా టిజిబికెఎస్ ప్రశంసనీయమైన పాత్రను పోషించింది.

సకల జనుల సమ్మెలో సింగరేణిలోని కార్మిక సంఘాలు భాగస్వాములను చేయాలనే సంకల్పంతో 'సింగరేణి జేయేసీ' 2011 జూలై 10వతేదీనాడు గోదావరిఖనిలో జేయేసీ చైర్మెన్ కోదండరామ్ సమక్షంలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. తెలంగాణ జేయేసీ పిలుపు మేరకు ఆగస్టు 1వతేదీనుండి జరిగే (కానీ పలుమార్లు వాయిదాల తర్వాత సెప్టెంబర్ 13వతేదీనుండి సకలజనులసమ్మె ప్రారంభమయ్యింది.) సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికవర్గాన్ని భాగస్వాములను చేయాలని, ఈ సమ్మెను ఐక్య ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలని, ఉమ్మడిగానే సమ్మె నోటీసు జారీ జేయాలని, ఈ సమ్మెను పారిశ్రామిక సమ్మెగా విస్తృతపరచాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. జూలై 15వ తేదీనాడు హైదరాబాద్‌లో జేయేసీ తరఫున సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. కానీ ఒక రోజు ముందుగానే ఏ.ఐ.టి.యు.సి నాయకులు జేయేసీతో సంబంధం లేకుండానే మరికొందరితో కలిసి విడిగా సమ్మెనోటీసును అందించాయి. భాగస్వామ్య సంఘాలతో కలిసి జేయేసీ ఆధ్వర్యంలో జూలై 15తేదీనాడు సింగరేణి చైర్మెన్‌కు సమ్మెనోటీసును ఇచ్చారు . అయితే సమ్మెనోటీసు అందించడానికి కాంగ్రెస్ అనుబంధ ఐ.ఎన్.టి.యు.సి., తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా ఉన్న టి.ఎన్.టి.యు.సి నాయకులు హాజరు కాలేదు. సింగరేణిలో ఐక్యఉద్యమానికి ఈ కార్మిక సంఘాలు సమ్మెనోటీసు సమయంలోనే తూట్లు పొడిచాయి.



www.eTelangana.org

సకల జనుల సమ్మెలో జూలై10వ తేదీనాడు గోదావరిఖని ప్రాంతంలో జరిగిన మూడు సమావేశాలు అత్యంత కీలకమైనవి. సకల జనుల సమ్మె విషయంలో వివిధ వర్గాలనుండి అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర జేయేసీలోనూ సమ్మె విషయంలో పూర్తి స్పష్టత కొరవడింది. ఇదే రోజున సింగరేణి అతిథిగృహంలో జరిగిన కార్మిక సంఘాల అఖిలపక్ష సమావేశంలో సింగరేణిలోని ప్రధాన కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపై ఉద్యమంలో భాగం కావడానికి ఏకగ్రీవ సమ్మతిని తెలియజేయడం సకల జనుల సమ్మె విషయంలో జేయేసీ రాష్ట్ర నాయకత్వానికి విశ్వాసాన్ని నింపింది. అదే రోజు సాయంత్రం మార్కండేయ కాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో గోదావరిఖని జేయేసీ బాధ్యుల సమావేశాన్ని విజయానంద్ ఏర్పాటు చేసారు. ఊహించని రీతిలో రామగుండం జేయేసీ, ఎన్టీపీసీ జేయేసీ, యైటింక్లైన్‌కాలనీ జేయేసీలు ర్యాలీలుగా సమావేశానికి హాజరయ్యారు. ఆర్టీసీ జేయేసీ, ఆటో యూనియన్ మిత్రులు సైతం ఇక్కడకు వచ్చారు. సమావేశం కిక్కిరిసిపోయింది. సకల జనుల సమ్మె విషయంలో వివిధ వర్గాలనుండి, సాధారణ ప్రజలనుండి స్వచ్ఛందంగా వస్తున్న స్పందన మాలో మరింత విశ్వాసాన్ని నింపింది. ఎన్టీపీసీ క్యాంపస్‌లో నివాసముంటున్న తెలంగాణ ప్రాంత ఉద్యోగులు అప్పటికప్పుడు ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఆహ్వానించారు. అయితే ఎన్టీపీసీ యాజమాన్యం క్యాంపస్‌లోపల తెలంగాణ మీటింగ్ పెట్టుకోవడానికి అభ్యంతరం తెలిపింది. టౌన్‌షిప్‌లోకి బయటనుండి ఎవ్వరూ రాకుండా రెండువైపులా గేట్లను మూసివేసారు. భారీగా పోలీసులను మోహరించారు. ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ స్వయంగా గేటు దగ్గర కాపలాకాసారు. మొత్తం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌ను పోలీసులు దిగ్బంధం చేసినంత పనిచేసారు. ఈ పరిస్థితులను గమనించిన ఎన్టీపీసీలోని తెలంగాణ ఉద్యోగుల్లో మరింత పట్టుదల పెరిగింది. అప్పటికప్పుడు ఒక బ్యానర్‌ను రాయించుకుని, వందలాదిమంది ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు మాకోసం ఎన్టీపీసీ గేటువద్ద ఎదురుచూసారు. పోలీసులతోనూ, ఎన్టీపీసీ అధికారులతోనూ వాగ్వివాదం పెట్టుకున్నారు. ఎన్టీపీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కూడా వీరికి మద్ధతు పలికారు. స్థానిక జేయేసీ కో-ఆర్డినేటర్ జే.వి. రాజు ఎన్టీపీసీ



పోలీసు అధికారులతో చర్చించి మేము గేటువరకు రావడానికి, అక్కడే ఉద్యోగులతో మాట్లాడటానికి అంగీకరించారు. చివరకు రాత్రి ఎనమిది గంటలకు వందలాదిమంది ఉద్యోగులు ఎన్టీపీసీనుండి ఉద్యోగుల సంఘం కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన రెండు సంవత్సరాల కాలంలో ఎన్టీపీసీలో ఉద్యోగులు తెలంగాణకోసం నిర్వహించిన మొట్టమొదటి ర్యాలీగా వారు చెప్పారు. గోదావరిఖనిలో ఒకేరోజున జరిగిన ఈ మూడు సంఘటనలు సకల జనుల సమ్మెకు ఎంతో స్ఫూర్తిని, విశ్వాసాన్ని ఇచ్చాయి.

సకల జనుల సమ్మె కాలంలో ప్రధాన కార్మిక సంఘాలు (కొన్నింటిని మినహాయిస్తే) తమ 'అశక్తత'ను అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శించాయి. ఈ విషయంలో, సింగరేణిలో ప్రధాన కార్మిక సంఘాలైన ఏఐటీయుసి, ఐఎన్‌టీయుసిల మధ్యనే ప్రధాన పోటీ కనిపించింది. ఈ రెండు కార్మిక సంఘాలే అధికారిక ప్రాతినిధ్య సంఘాలుగా ఉన్న (పదవీకాలం ఈ మధ్యనే ముగిసింది) ఖమ్మం జిల్లా కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి ప్రాంతాలలో సమ్మె పూర్తిగా విఫలమయ్యింది. కార్మిక సంఘాలకు చెందిన ముఖ్యనాయకులు, ఏరియా బాధ్యులు, కార్యకర్తలు, పిట్ కమిటీ నాయకులు, సభ్యులు సమ్మెకాలంలో విధులకు హాజరై సమ్మెవిచ్ఛిన్నానికి మార్గం సుగమం చేసారు. ఖమ్మం జిల్లాలో సమ్మె జరగకుండా ద్రోహపూరితమైన పాత్రను పోషించారు. సమ్మెకాలంలో కొన్ని కీలకమైన సందర్భాలలో యూనియన్ నాయకులే పోలీసులతో మిలాఖతై 'ముందస్తు అరెస్టు' డ్రామాలను రక్తికట్టించారు. తెలంగాణ జేయేసీ తరఫున కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ప్రాంతాలలో సమ్మె పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన జేయేసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పిట్టల రవీందర్‌పై కొత్తగూడెంలో దాడి జరిగింది.

సెప్టెంబర్ 13వతేదీనాడు మొదటి షిఫ్టుతో సింగరేణి గని కార్మికులు సమ్మెసైరన్ మోగించడంతోనే 'సకల జనుల సమ్మె' ప్రారంభమయ్యింది. 26రోజులపాటు సమ్మె విజయవంతంగా కొనసాగుతున్న సమయంలోనే అక్టోబర్ 8వతేదీనాడు హైదరాబాద్‌లోని తెలంగాణ జేయేసీ కార్యాలయంలో సింగరేణి కార్మిక సంఘాల ముఖ్యనేతలతో సమ్మెపై సమీక్షా సమావేశం



www.eTelangana.org

జరిగింది. సింగరేణిలో సమ్మె పరిస్థితులను ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు. కార్మిక సంఘాల నాయకులు వారివారి సంఘాలకు సంబంధించిన అభిప్రాయాలను ఈసమావేశంలో వెల్లడించారు. సింగరేణిలో ప్రధాన కార్మిక సంఘాలకు చెందిన (ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి., టి.జి.బి.కె.ఎస్., బి.ఎం.ఎస్., టి.ఎన్.టి.యు.సి.,) నాయకులందరూ ... సింగరేణిలో సమ్మెను మరికొంతకాలం కొనసాగించలేమని, కొనసాగించడంద్వారా ప్రయోజనం కనిపించడంలేదని, సమ్మెకు 'విరామం' ప్రకటించాలని ... ఏకాభిప్రాయం వ్యక్తం చేసారు. తెలంగాణపై స్పష్టమైన ప్రకటన వెలువడేవరకూ సింగరేణిలో సమ్మెను కొనసాగించాలని హెచ్.యం.ఎస్., ఐ.ఎఫ్.టి.యు., తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. అయితే సమ్మె ఉధృతదశలో కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణిలో సమ్మెను విరమించడం మంచిదికాదని, సమ్మెను మరో ఐదు రోజులపాటు కొనసాగించి అక్టోబర్ 13వతేదీనాడు అప్పటి పరిస్తితులను చర్చించి నిర్ణయం తీసుకుందామని జేయేసీ ఛైర్మెన్ కోదండరామ్ సూచించారు. సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, తదితర సంఘాలందరితో చర్చించి, ఉమ్మడిగా నిర్ణయం తీసుకుని 'విరామం' లేదా 'విరమణ' ప్రకటన కూడా ఉమ్మడిగానే చేస్తేబాగుంటుందని జేయేసీ కో-ఛైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలోనే సింగరేణి ప్రాంతాలలో అమలు చేయవలసిన నాలుగు రోజుల కార్యాచరణను ఈ సమావేశంలోనే చర్చించి నిర్ణయం తీసుకున్నారు. మీడియా ద్వారా అదేరోజు ప్రకటించారు. ఆ మరునాడే అంటే అక్టోబర్ 9వతేదీనాడు తెలంగాణ జేయేసీ అగ్రనాయకత్వం, జేయేసీలో భాగస్వామ్యపార్టీలకు చెందిన నాయకులు, సింగరేణిలోని ప్రధాన కార్మిక సంఘాల నాయకులందరూ కలిసి సంయుక్తంగా కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ప్రాంతాలను 'సింగరేణి యాత్ర' పేరుతో పర్యటించాలని నిర్ణయించారు. సింగరేణి కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులతో ఉమ్మడి సమావేశాన్ని కొత్తగూడెంలో ఏర్పాటు చేసి, కార్మిక సంఘాల ప్రతినిధులెవ్వరూ డ్యూటీలకు హాజరు కాకుండా కట్టుదిట్టమైన



చర్యలు తీసుకోవాలనుకున్నారు. అనూహ్యమైన రీతిలో 'సింగరేణి యాత్ర'ను పోలీసులు అడ్డుకున్నారు. (సకల జనుల సమ్మెలో కీలకంగా మారిన సింగరేణిలోసమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం 'సింగరేణి యాత్ర'ను భగ్నం చేసే ప్రయత్నం చేసింది. ఖమ్మం జిల్లాలో సమ్మె ప్రభావం లేకుండా లోపాయికారీగా 'సహకరించిన' నాయకులే 'సింగరేణి యాత్ర'ను భగ్నం చేయాలనే 'ఆలోచన'ను ప్రభుత్వ పెద్దలకు అందించినట్లు సమాచారం.) ఆశ్చర్యకరమైనరీతిలో సింగరేణి కార్మిక సంఘాల నాయకులెవ్వరూ 9వతేదీనాడు కొత్తగూడెం చేరుకోలేదు. కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులతో ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించలేదు. 'సింగరేణి యాత్ర'లో కొత్తగూడెం బయలుదేరిన కోదండరామ్‌ను మార్గమధ్యంలో పోలీసులు ఆలేరువద్ద అరెస్టు చేయడం సింగరేణి కార్మిక సంఘనాయకుల 'దాగుడుమూతలకు' ఒక అవకాశంగా పనికివచ్చింది. సకల జనుల సమ్మె నుండి సింగరేణిని తప్పించేందుకు అవసరమైన నేపథ్యం ఇదేరోజున సిద్ధమయ్యింది. అక్టోబర్ 8వతేదీనాడు హైదరాబాద్‌లో తెలంగాణ జేయేసీ కార్యాలయంలో జరిగిన కీలకమైన సమావేశంలో సింగరేణి కార్మిక సంఘాల నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను గమనిస్తే ఇదే విషయం స్పష్టమవుతున్నది.

# సమ్మె విరమణపై కార్మిక సంఘాల వైఖరి

**బి. వెంకట్రావ్ (ఐఎన్‌టీయుసి)**

సింగరేణి సమ్మె కొనసాగింపు విషయంలో తెలంగాణ జేయేసీ తీసుకునే నిర్ణయానికి ఐఎన్‌టీయుసి కట్టుబడి ఉంటుంది. తెలంగాణపై స్పష్టమైన నిర్ణయం వెలువడేవరకూ సమ్మె కొనసాగించాలనే విషయంలో మొదటినుండి కార్మికసంఘాలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో పనినడపటంపై అందరమూ దృష్టిపెట్టాలి. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్లు జిల్లాలోని సింగరేణి గనుల్లో సమ్మె విజయవంతంగా నడవడానికి ఈ ప్రాంతాలకు ప్రత్యేకమైన చారిత్రక నేపధ్యం ఉన్నది. ఖమ్మం జిల్లాలో పరిస్థితులు మొదటినుండి వేరుగానే ఉంటూవస్తున్నాయి. ఇక్కడ సమ్మెను విజయవంతం చేయడంలో అన్ని సంఘాలు విఫలమయ్యాయి. ఖమ్మం జిల్లా మణుగూరులో 18వతేదీనుండి సమ్మెను విరమించాలని అన్ని కార్మిక సంఘాల నాయకులు సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడిగా కరపత్రాలు పంచారు. సింగరేణిలో సమ్మె ఎప్పటివరకు కొనసాగించాలో తేల్చిచెప్పాలని యూనియన్ ఆఫీసుల్లో కార్మికులు నాయకులను నిలదీస్తున్నారు. రాజకీయ జేయేసీ ఇచ్చే పిలుపు మేరకే నడుచుకుంటామని కార్మికులకు తేల్చి చెబుతున్నాం. అనుకున్న రీతిలో పారిశ్రామిక సమ్మెను చేయలేకపోయాం. కార్మికవర్గంపై యూనియన్‌ల పట్టుసడలిపోకుండా, ఎప్పుడు అవసరమైతే అప్పుడు సింగరేణి కార్మికులు తిరిగి సమ్మెలో పాల్గొనే విధంగా సమ్మె విరమణపై ఒక ఖచ్చితమైన తేదీని నిర్ణయిస్తే బాగుంటుంది.



**వాసిరెడ్డి సీతారామయ్య (ఏఐటీయుసి)**

గతంలో జరిగిన సమీక్షా సమావేశంలోనే మా వైఖరిని స్పష్టం చేసాం. సింగరేణి ప్రాంతాల్లో ఉన్న ఇతర పరిశ్రమల్లో సమ్మెలో లేకపోవడం, సమ్మె కాలంలో సింగరేణి గని కార్మికులు వేతనాలను కోల్పోయే పరిస్థితులు ఉండటం, గతంలో తీసుకున్న నిర్ణయాలు అమలు జరగకపోవడంవల్ల సమ్మెను విస్తృతం చేయడంలోనూ, కొనసాగించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖమ్మంజిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందులాంటి ప్రాంతాలలో ఎంత ప్రయత్నించినా ఆశించిన ఫలితాలు కనిపించడంలేదు. ఇక్కడ అన్ని యూనియన్‌ల నాయకులు డ్యూటీలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఏ పోరాటంలోనైనా 'విరామం' అవసరమే ! సింగరేణి గని కార్మికుల్లో పోరాట పటిమ ఉన్నది. కేంద్రప్రభుత్వం నుండి అనుకూలమైన పరిస్థితులు కనిపిస్తే సమ్మె కొనసాగించాలి. లేదంటే సమ్మెకు విరామం ప్రకటించి, తిరిగి అవసరమైనప్పుడు సమ్మెలోకి దిగాలి. యూనియన్‌లపట్ల కార్మికుల్లో విశ్వాసం పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనమీద ఉన్నది.

**పులి రాజిరెడ్డి (బి.ఎం.ఎస్)**

సింగరేణిలో గనికార్మికులు స్వచ్ఛందంగా స్పందించి సమ్మెలోకి దిగారు. కేంద్రం నుండి తెలంగాణపై ఎట్లాంటి స్పష్టమైన సూచనలు కనిపిస్తలేవు. పారిశ్రామిక సమ్మె లేకుండా కేవలం సింగరేణిలో మాత్రమే సమ్మెను కొనసాగించడంపై సింగరేణి గనికార్మికుల్లో అసహనం పెరుగుతున్నది. ఎప్పటివరకు సమ్మెను కొనసాగించాలో ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని కార్మికులు అడుగుతున్నారు. క్రమక్రమంగా సింగరేణిలో సమ్మెపై పట్టు సడలిపోతున్నది. ప్రస్తుతానికి యుద్ధవిరామం ప్రకటించి, అవసరమైనప్పుడు తిరిగి మరింత ఉధృతంగా చేద్దాం.

**పెద్దపెల్లి సత్యనారాయణ (టి.ఎన్.టి.యు.సి)**

సింగరేణి సమ్మెను విజయవంతం చేయడంలో ఖమ్మం జిల్లాలో యూనియన్ నాయకులు ఎట్లాంటి ప్రయత్నాలు చేయలేదు. జేయేసీ ప్రకటించిన పారిశ్రామిక బంద్ విఫలమయ్యింది. మరోవైపున టిఆర్ఎస్ ఎమ్మెల్యే అరవిందరెడ్డి పైపుల ఫ్యాక్టరీ నడుస్తున్నది. సమ్మె విరమించినంత


www.eTelangana.org

మాత్రాన ఉద్యమంలో వెన్ను చూపినట్లు కాదు. సరైన నిర్ణయం తీసుకోవాలి. సమ్మెకాలంలో యూనియన్ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలకోసం తాపత్రయపడటం సరికాదు.

**పి. తిరుపతిరాజు (టీ.జీ.బి.కె.ఎస్.)**

ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకాలంలో వేతనాలు పొందేందుకు అవకాశం ఉన్నది. కానీ సింగరేణిలో ఆ వెసులుబాటు లేదు. సింగరేణి చైర్మెన్‌తో జేయేసీ నాయకులు చర్చించి సమ్మెకాలంలో అడ్వాన్సు ఇప్పించాలి. భవిష్యత్తులో తెలంగాణ సాధించుకునేదాకా నిరవధికంగా సమ్మె చేస్తామని హెచ్చరించి, ఇప్పుడు సమ్మెను విరమించాలి. రాజకీయ జేయేసీ ఎట్లా నిర్ణయిస్తే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అట్లాగే నడుచుకుంటుంది.

**రియాజ్ అహ్మద్ (హెచ్.ఎం.ఎస్)**

ఖమ్మం జిల్లాలో హెచ్.ఎం.ఎస్., టి.జి.బి.కె.ఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలకు చెందిన నాయకులు సమ్మెకాలంలోనూ డ్యూటీలు చేస్తున్నారు. సింగరేణి అధికారులు ద్రోహపూరితంగా వ్యవహరిస్తు న్నారు.సింగరేణిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన అధికారులే పనిచేస్తు న్నారు. సమ్మెను విఫలం చేస్తున్నారు. కేశోరాం సిమెంటు కంపెనీలో యాజమాన్యమే బంద్ పాటిస్తున్నది. కొత్తగూడెం నుండి సింగరేణి యాత్రను ప్రారంభించాలి. కె.సి.ఆర్., కోదండరామ్, ఇతర జేయేసీ నాయకులు ఈ యాత్రలో పాల్గొనాలి. ముఖ్యమైన కార్మిక సంఘాల నాయకులే సమ్మెకాలంలో డ్యూటీలు చేస్తున్నారు. అత్యవసర సిబ్బంది పేరుమీద ప్రధాన కార్మిక సంఘాల నాయకులే విధులకు హాజరవుతున్నారు. సింగరేణిలో ఇప్పుడు సమ్మెను విరమిస్తే తెలంగాణ ఉద్యమం పదేళ్లు వెనక్కి పోతుంది. సింగరేణి గని కార్మికుల శక్తిని నీరుగార్చవద్దు. సమ్మె కొనసాగించడానికి సింగరేణి కార్మికులు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ జేయేసీ సమ్మె కొనసాగింపు విషయంలో ఖచ్చితమైన మార్గనిర్దేశం చేయాలి.

**సంపత్‌కుమార్ (ఐ.ఎఫ్.టీ.యు)**

ఉద్యమంలో ఇప్పటికే 80శాతం ముందుకు వెళ్లాం. మరో 20శాతంలాగితే గోల్ సాధిస్తాం. ఈ పరిస్థితుల్లో విరమణ ఆలోచన సరికాదు. తెలంగాణ సమాజమంతా సింగరేణి వైపు చూస్తున్నది. సింగరేణి



సమ్మె ఫలితంగానే కేంద్రంలో చలనం కనిపిస్తున్నది. ఈ తరుణంలో విరామం, విరమణ గురించి మాట్లాడటం సరికాదు. ఇక్కడున్న కార్మిక సంఘాలన్నీ చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఫలితం వస్తుంది. తెలంగాణకు అనుకూలంగా ఉన్న ప్రజాప్రతినిధులందరినీ కలుపుకుని కొత్తగూడెంలో యాత్రను నిర్వహించి, కనీసం కార్మిక సంఘాల క్యాడర్‌ను సమ్మెలోకి దింపగలిగినా ఫలితం ఉంటుంది. మిగితా ప్రాంతాల్లోనూ పరిస్థితులు మారుతాయి. రాజకీయ నాయకత్వం అంతా సింగరేణి సమ్మెపై దృష్టిపెట్టాలి. రైల్‌రోక్ కార్యక్రమం పూర్తయ్యేవరకైనా సింగరేణిలో సమ్మెను కొనసాగిస్తే పరిస్థితి అనుకూలంగా ఉంటుంది.

**నీరటి రాజన్న (సింగరేణి తెలంగాణ ఉద్యోగుల సంఘం)**

రాజకీయ జేయేసీ ఖమ్మం జిల్లాలో సమ్మెపై దృష్టి పెట్టలేదు. ప్రజలను కదిలించాలి. మీరు నిర్ణయం తీసుకుని మామీద రుద్దుతున్నారు. జేయేసీ నాయకత్వం, రాజకీయ నాయకత్వం సింగరేణి ప్రాంతాలలో ఎందుకు పర్యటించలేదు? సింగరేణి, ఆర్టీసీ సమ్మె ఫలితంగానే కేంద్రంలో కదలిక మొదలయ్యింది. జేయేసీ బాధ్యత వహించాలి. సమ్మెను కొనసాగించాలి. తెలంగాణ అంశం ముందుకుపోతున్న తరుణంలో సమ్మె విరమణ ఆలోచన మంచిదికాదు. ఖమ్మం జిల్లాలో సమ్మెను విజయవంతం చేస్తేనే మిగిలిన ప్రాంతాలలో సమ్మె కొనసాగుతుంది.ఇక్కడ ఆర్థిక ప్రయోజనాలకోసమే కార్మికులు సమ్మెలో పాల్గొనడంలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష బలంగా ఉండటంవల్లనే కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొం టున్నారు.



www.eTelangana.org

# సకల జనుల సమ్మె - సింగరేణి జేయేసీ

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కార్మిక వర్గాన్ని సమీకరించే పనిలో భాగంగా సింగరేణి, ఆర్టీసీ, సినిమా పరిశ్రమ తదితర రంగాలలో జేయేసీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ జేయేసీ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగానే హైదరాబాద్‌లో 2010 మే నెలలో వరుసగా సన్నాహక సదస్సులను నిర్వహించాము. 'ప్రపంచ గని కార్మికుల దినోత్సవం' రోజున (మే 4నాడు) సింగరేణి జేయేసీ సన్నాహక సమావేశం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పిట్టల రవీందర్ అధ్యక్షతన జరిగింది. సింగరేణి అన్ని ప్రాంతాలనుండి వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు ఈ సన్నాహక సదస్సుకు హాజరై సింగరేణిలో ఉమ్మడి ఉద్యమ ఆవశ్యకతను వెల్లడించారు. హాజరైన కార్మిక సంఘాల ప్రతినిధులు, ఇతరులతో కలిపి ఒక తాత్కాలిక కమిటీతో సింగరేణి జేయేసిని ప్రకటించాము. మే 15వ తేదీనాడు గోదావరిఖని ప్రెస్‌క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టు యం.డి. మునీర్ చైర్మెన్‌గా పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసాము. ఇట్లా ప్రారంభమైన సింగరేణి జేయేసీ కోల్‌బెల్ట్‌లోని అన్ని ప్రాంతాలలో స్థానిక కమిటీలతో విస్తరించుకుని, తెలంగాణ జేయేసీ రాష్ట్ర కమిటీ ఇచ్చే కార్యక్రమాలలో క్రియాశీలకంగా భాగమయ్యింది.

సంస్కరణల పేరిట అమలులోకి తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానాలలో భాగంగా సింగరేణిలో 'ఒక పరిశ్రమల-ఒకే యూనియన్' విధానం ఐక్య ఉద్యమాలకు విఘాతం కలిగించింది. కార్మికుల హక్కుల పరిరక్షణకంటే సింగరేణిలో అధికారం పొందడమే కార్మిక సంఘాల ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. కార్మిక సంఘాల మధ్యన అంతర్గతపోరు



తీవ్రమయ్యింది. ఫలితంగా సింగరేణిలో ఉమ్మడి పోరాటాలకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమంలోకి సింగరేణి కార్మిక సంఘాలను ఐక్యం చేయడంలోనూ, ఉమ్మడి వేదికమీదికి తీసుకురావడంలోనూ సింగరేణి జేయేసీ చేసిన కృషి, సాధించిన ఫలితాలు అత్యంత అద్భుతమైనవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతోనే సింగరేణి సమస్యలకు పరిష్కారం సులభమవుతుందనే ఏకాభిప్రాయం సింగరేణి గనికార్మికవర్గంలో నెలకొనిఉండటంవల్ల సింగరేణి జేయేసి' ప్రయత్నాలన్నీ మరింత సుళువుగానే ఫలించాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఆరు సందర్భాలలో సుమారు తొమ్మిది రోజులపాటు జరిగిన సమ్మె సందర్భాలలో ప్రధాన కార్మిక సంఘాలు తీవ్రంగా విభేదించి, సమ్మెలను విఫలం చేయడానికి ప్రయత్నించినప్పటికీ, సకల జనుల సమ్మె సందర్భంలో మాత్రం ఈ సంఘాలు కార్మికులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించేందుకు సాహసం చేయలేకపోయాయి. సింగరేణి జేయేసీలో భాగంగాలేని ఏఐటీయుసి, ఐఎన్‌టీయుసి,టీఎన్‌టీయుసి, తదితర కార్మిక సంఘాలు అనివార్యంగా సకల జనుల సమ్మెకు మద్దతు పలకాల్సివచ్చింది. ఈ సంఘాలను ఉద్యమంలోకి సమీకరించడంలోనూ, సమ్మెకాలంలో సమన్వయం సాధించడంలోనూ సింగరేణి జేయేసీ కృషి ప్రసంశనీయమైన పాత్రను పోషించింది. అయితే ఖమ్మంజిల్లాలో పరిస్థితులను చక్కదిద్దడంలో సింగరేణి జేయేసి విఫలమైన వాస్తవాన్ని ఒప్పుకోకతప్పదు.

సకల జనుల సమ్మెలో సింగరేణిలోని కార్మిక సంఘాలు భాగస్వాములను చేయాలనే సంకల్పంతో 'సింగరేణి జేయేసీ' 2011 జూలై 10వతేదీనాడు గోదవారిఖనిలో జేయేసీ చైర్మెన్ కోదండరామ్ సమక్షంలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సకల జనుల సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మెను కొనసాగించేందుకు అవసరమైన భావవ్యాప్తిని నిర్వహించాలని, ఇందులో భాగంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు వెలువరించాలని అనుకున్నారు. అదే విధంగా అన్ని ప్రాంతాల్లోనూ కార్మికులతోనూ, కార్మిక సంఘాల ప్రతినిధులతోనూ ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించి సకల జనుల సమ్మె ప్రాముఖ్యాన్ని తెలియజేయాలని కూడా ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించి సింగరేణి



www.eTelangana.org

జేయేసి కొన్ని తేదీలను కూడా ప్రకటించింది. పలుమార్లు వాయిదాలు వేసుకున్నది. సకల జనుల సమ్మెను మొదట ఆగస్టు ఒకటోతేదీనుండి ప్రారంభించాలని తెలంగాణ జేయేసి ప్రకటించింది. అనేక వాయిదాల తర్వాత సమ్మె సెప్టెంబర్ 13వతేదీనుండి ప్రారంభమయ్యింది. ఈలోగా సింగరేణి వ్యాపితంగా సమ్మె విషయంలో మరింత ఐక్యతను సాధించేందుకు అవసరమైన కార్యాచరణను సింగరేణి జేయేసి తీసుకోలేకపోయింది. ముఖ్యంగా సమ్మె విషయంలో అంతగా స్పందన కనిపించని కొత్తగూడెం, మణుగూరులాంటి ప్రాంతాలలో సింగరేణి జేయేసి ప్రత్యేక శ్రద్ధను చూపించలేకపోయింది. అనేక దీర్ఘకాలిక సమ్మెల్లో పాల్గొన్న చైతన్యంతో నిండిన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్లు జిల్లాలలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలలో మాత్రమే సింగరేణి జేయేసీ, అందులో భాగస్వాములైన ప్రధాన కార్మిక సంఘాలు దృష్టిని కేంద్రీకరించాయి.సింగరేణి సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సంఘాలుగానీ, సంస్థలుగానీ పై మూడు జిల్లాలలో మాత్రమే పర్యటించాయి. సమ్మెకాలంలో ఖమ్మంజిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాల వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూసిన పాపానపోలేదు. ఖమ్మం జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలను పర్యటించిన కార్మిక సంఘాల నేతలు, జేయేసి నాయకులు పోలీసు నిర్బంధాన్ని చవిచూడవలసివచ్చింది.

ఏదిఏమైనా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత, 'సికాస' నాయకత్వంలో జరిగిన ఐక్యఉద్యమాల పరంపరలో తిరిగి సకల జనుల సమ్మె సందర్భంగానే సింగరేణిలో ఐక్యఉద్యమాన్ని నిర్మించడంలో సింగరేణి జేయేసి చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర సాధన భవిష్యత్తు ఉద్యమంలో సింగరేణి గని కార్మికుల పాత్రను మరింతగా పెంచడంలోనూ, సింగరేణి కార్మికోద్యమ క్రమంలోనూ ఈ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో సందేహంలేదు.



# సింగరేణి సమ్మె - సంఘీభావ యాత్రలు

సకల జనుల సమ్మెలో పౌరసమాజాన్ని భాగస్వాములను చేసేందుకు తెలంగాణలోని అనేక సంఘాలు, సంస్థలు, వ్యక్తులు తమ తమ పద్ధతుల్లో ప్రయత్నాలు చేసాయి. సమ్మెలో ముఖ్యభూమికను పోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలకు చెందిన నాయకత్వం తమ శ్రేణులను సమ్మెలో నిలుపుకునేందుకు అనేక పద్ధతుల్లో ప్రయత్నించి, ఫలితం సాధించాయి. తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టిఎన్జీవో) నాయకత్వంలో ఉన్న ఉద్యోగులను దీర్ఘకాలిక సమ్మెకు మానసికంగా సిద్ధం చేయడంలో ఉద్యోగ సంఘాల జేయేసీ నాయకత్వం తీవ్రంగా కృషిచేసింది. ఫలితంగా 42రోజులపాటు ఉద్యోగవర్గాలు సమ్మెలో నిలవగలిగారు. ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు బహుళ నాయకత్వంలో కొనసాగుతుండటంవల్ల సమ్మెను దీర్ఘకాలికంగా కొనసాగించడంలో ఆయా నాయకత్వాలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసివచ్చింది. ముఖ్యంగా సకల జనుల సమ్మెలో సింగరేణి గని కార్మికుల సమ్మె అత్యంత కీలకంగా మారిపోయింది. అందువల్ల సింగరేణి గని కార్మికుల సమ్మెచుట్టూ అన్ని వర్గాల దృష్టి కేంద్రీకృతమయ్యింది.

సమ్మె కొనసాగిస్తున్న కార్మికవర్గాన్ని అభినందించేందుకు, ప్రోత్సహించేందుకు, ఉత్తేజితులను చేసేందుకు అనేక సంస్థలు సంఘీభావ యాత్రలను నిర్వహించాయి. ఇందులో 'తెలంగాణ జర్నలిస్టుల ఫోరం' నిర్వహించిన బస్సుయాత్ర అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తెలంగాణ ఉద్యమ నాయకత్వంలో అక్కడి జర్నలిస్టులు నిర్వహిస్తున్న పాత్ర అత్యంత కీలకమైనది కావడంకూడా ఇందుకు దోహదం


www.eTelangana.org

చేసింది. సింగరేణి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన నిర్బంధాన్ని ప్రధాన అంశంగా జర్నలిస్టుల యాత్ర కొన సాగింది. సెప్టెంబర్ 18వతేదీనాడు తెలంగాణ జర్నలిస్టుల ఫోరం సోమాజి గూడా ప్రెస్‌క్లబ్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి సింగరేణి గనికార్మికుల సమ్మెకు సంఘీభావాన్ని కూడగట్టింది. ఫోరం ఆధ్వర్యంలో అదే రోజు సాయంత్రం ముఖ్యమంత్రిని కలిసి కోల్‌బెల్ట్‌లో అమలు జరుగుతున్న నిర్బంధాన్ని ఆపాలని డిమాండు చేసింది. సింగరేణి సమ్మెకారణంగానే తెలంగాణ ప్రాంతంలో రైతులు తీవ్రమైన కరంటు కొరతను ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి చేసిన వాదనలను ఫోరం నాయకులు ఖండించారు. తెలంగాణ కూడా ఆంధ్రప్రదేశ్‌లో భాగమైనప్పుడు కరెంటు కొరత కేవలం తెలంగాణ ప్రాంతంలో మాత్రమే ఎందుకున్నదని ముఖ్యమంత్రిని జర్నలిస్టుల ఫోరం నాయకులు ప్రశ్నించారు. సింగరేణి గని కార్మికులపై జరుగుతున్న పోలీసు నిర్బంధాలను, సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి, సమ్మె చేస్తున్న గని కార్మికుల్లో ధైర్యం నింపడానికి సెప్టెంబర్ 20, 21తేదీలలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రెండురోజులపాటు 'సింగరేణి సమ్మె సంఘీభావ యాత్ర'ను నిర్వహించింది. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కన్వీనర్ అల్లం నారాయణ నేతృత్వంలో బయలుదేరిన ఈ సంఘీభావ బస్సుయాత్రలో జర్నలిస్టుల ఫోరం నాయకులు సి.హెచ్. క్రాంతికుమార్, పల్లె రవికుమార్, రమేష్ హజారే, టిపిఎఫ్ నాయకులు గద్దర్, వేదకుమార్, రత్నమాల, టఫ్ కో చైర్మన్ విమలక్క, వివిధ పార్టీల నాయకులు నాగం జనార్థన్ రెడ్డి, జి. వివేక్, బి. వెంకట్రావ్, నాయిని నర్సింహారెడ్డి, సముద్రాల వేణుగోపాలాచారి, బద్దం బాల్‌రెడ్డి, గుండా మల్లేష్, గడ్డం అరవిందరెడ్డి, కొప్పుల ఈశ్వర్, నల్లాల ఓదెలు,అడ్వకేట్స్ జేయేసీ ప్రతినిధి ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నిర్వహించిన సింగరేణి సమ్మె సంఘీభావ యాత్రకు కోల్‌బెల్ట్‌లోని శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మంచిర్యాల, గోదావరిఖని, భూపాలపల్లి ప్రాంతాల్లో అపూర్వమైన ప్రతిస్పందన లభించింది. సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు, సమ్మెకు నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలకు జర్నలిస్టుల ఫోరం నిర్వహించిన ఈ యాత్ర



మనోధైర్యాన్ని ఇవ్వగలిగింది.అయితే జర్నలిస్టుల ఫోరం యాత్రలో వెళ్లిన పెద్దపెల్లి పార్లమెంటు సభ్యుడు జి. వివేక్‌కు ప్రజల నుండి తీవ్రమైన నిరసన వ్యక్తమయ్యింది. పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని ప్రజలు పెద్దయెత్తున డిమాండు చేసారు.

సకల జనుల సమ్మెలో పౌరసమాజాన్ని భాగస్వాములను చేసేందుకు 'తెలంగాణ విద్యావంతుల వేదిక' తనవంతు పాత్రను నిర్వహించింది. తెలంగాణ విద్యావంతులవేదిక రాష్ట్ర నాయకత్వం తెలంగాణ జేయేసీలో క్రియాశీలకమైన పాత్రను నిర్వహిస్తూనే, ప్రత్యేకించి విద్యావంతుల వేదిక పక్షాన సమ్మెకు అనుకూలంగా అన్ని జిల్లాలలోనూ భావవ్యాప్తి కార్య క్రమాలను విరివిగా నిర్వహించింది. సమ్మెకు అనుకూలంగా దినపత్రికల్లో వ్యాసాలు రాయడంతోపాటుగా, సకల జనుల సమ్మెను సమర్థిస్తూ లక్ష కరపత్రాలనువేదిక పక్షాన అన్నిజిల్లాలలో పంపిణీ చేయడం జరిగింది. సమ్మె జరుగుతున్న రోజుల్లోనే సెప్టెంబర్ 28–అక్టోబర్ 1వతేదీలలో నాలుగు రోజులపాటు తెలంగాణ డెవెలప్‌మెంట్ ఫోరం (టిడిఎఫ్–ఇండియా) సహకారంతో విద్యావంతుల వేదిక నిర్వహించిన సంఘీభావ యాత్ర సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోనూ పర్యటించింది. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే నాయకత్వంలో నిర్వహించిన ఈ సంఘీభావ యాత్రలో వేదిక నాయకులు ఆవునూరి సమ్మయ్య, సుందిళ్ల రాజన్న, సి.హెచ్. నారాయణ రాజు, పెద్ది రాజు, కోల నర్సింహులు, ఎన్. నరేందర్, రామగిరి ప్రకాశ్, ఏలేటి లక్ష్మారెడ్డి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతుల వేదిక బస్సుయాత్ర మూడవరోజున శ్రీరాంపూర్ చేరుకునే సమయానికి (సెప్టెంబర్ 30వతేదీ ఉదయం 9గంటలకు) అక్కడి సింగరేణి జి.ఎం. కార్యాలయం ముందు అన్ని కార్మిక సంఘాలకు చెందిన వందలాది మంది కార్మికులు ధర్నా నిర్వహిస్తున్నారు. అన్ని కార్మిక సంఘాలకు చెందిన వందలాది జెండాలతో ఆ ప్రాంతమంతా ఉద్యమ ప్రతిబింబంగా కనిపించింది. సింగరేణిలో సమ్మె ప్రారంభమై అప్పటికే 18రోజులు గడుస్తున్నప్పటికీ కార్మికుల్లో పట్టుదల మరింతగా పెరిగినట్లు


www.eTelangana.org

కనిపించింది. ధర్నాలో భాగంగా పార్లమెంటులో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టాలని, బొగ్గుగనులవద్దనుండి పోలీసు బలగాలను ఉపసంహరించాలని డిమాండు చేస్తూ కార్మిక సంఘాల నాయకులు సింగరేణి అధికారులకు మెమోరాండం సమర్పించారు. కొంతమంది కార్మికులు మమ్మల్ని చుట్టుముట్టి సమ్మె సంగతులను అడిగి తెలుసుకున్నారు. వారినుండి మేము అనేక ప్రశ్నలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. సహాయ నిరాకరణ సమయంలో సమ్మె చేసిన ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించారు. కానీ ఇప్పటికే తొమ్మిది రోజులు సమ్మె చేసిన సింగరేణి గని కార్మికులు మాత్రమే వేతనాలను కోల్పోయారు. ఈ విషయంలో తెలంగాణ జేయేసి బాధ్యత తీసుకోవాలని గని కార్మికులు సూచించారు. "ఎన్ని రోజులు వేతనాలు కోల్పోయినా ఫరవాలేదు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేవరకూ సమ్మెను విరమించవద్దని మరికొందరు గని కార్మికులు తేల్చిచెప్పారు. సింగరేణిలో మేమందరమూ సమ్మెలో ఉంటే, మా బొగ్గుమీద ఆధారపడి నడుస్తున్న ఎన్టీపీసీలో కార్మికులు, ఉద్యోగులు ఎందుకు సమ్మె చేయడం లేదని" మరికొందరు ప్రశ్నించారు. సకల జనుల సమ్మె కొనసాగుతున్న సమయంలోనే బాన్సువాడలో టిఆర్ఎస్ ఎన్నికల్లో పోటీ చేయడమేమిటని మరికొంతమంది కార్మికులు అభ్యంతరాలు వ్యక్తం చేసారు.

గోదావరిఖని చౌరస్తాలో స్థానిక జేయేసీ ఆధ్వర్యంలో సమ్మెకాలంలో నిర్వహించిన ఉద్యమ శిబిరం ప్రతిరోజూ ఒక జాతర వాతావరణాన్ని తలపింపజేసింది. విద్యావంతుల వేదిక సంఘీభావ బస్సుయాత్ర గోదావరిఖని, యైటింక్లైన్‌కాలనీ, సెంటినరీకాలనీ, మంథని, కాటారం మీదుగా అదే రాత్రి భూపాలపల్లి చేరుకున్నది. భూపాలపల్లిలో వందలాదిమంది కార్మికులు తెలంగాణ తల్లి విగ్రహం నుండి అంబేడ్కర్ విగ్రహందాకా నినాదాల హోరుతో ఊరేగింపును నిర్వహించారు. ఉద్యమం ఉధృతంగా సాగుతున్న తరుణంలో జేయేసీ నాయకులు ఢిల్లీకి వెళ్లడాన్ని ఇక్కడ కార్మికులు తీవ్రంగా అభ్యంతరపెట్టారు. ఈ పరిణామాలు తమను కృంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.

అప్పటికే మా యాత్ర హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో పర్యటన పూర్తి చేసుకున్నది. జిల్లా కేంద్రాలలో



జరుగుతున్న సమ్మెకు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పాల్గొంటున్న ఆందోళనారూపాలకు, సమ్మె ఉధృతంగా సాగుతున్న కోల్‌బెల్ట్ ప్రాంతాలకు చాలా తేడా కనిపించింది. పట్టణ ప్రాంతాలలో రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మీడియా హడావుడి ఎక్కువగా కనిపిస్తే, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో మహిళలు, యువకులు, కులవృత్తుల ప్రజలు ఉద్యమ శిబిరాలవద్ద, ప్రధాన రోడ్లమీద తమ ఆందోళనలను నిర్వహించారు. సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలోకంటే, సకల జనుల సమ్మె కాలంలో ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం బాగా పెరిగింది. ఫలితంగా తెలంగాణ అంతటా ఒక ఉద్విగ్నభరితమైన ఉద్యమ వాతావరణం నెలకొన్నది. ముఖ్యంగా సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాలలో సమ్మె తీవ్రత మరింత ఎక్కువగా ప్రతిధ్వనించింది.

సకల జనుల సమ్మెకు ముందు, సమ్మె సందర్భంలోనూ తెలంగాణ జేయేసీలో భాగస్వామ్య సంస్థలుగా పనిచేస్తున్న వివిధ జేయేసీలు కూడా సంఘీభావ యాత్రలను, సమాయాత్త యాత్రలను నిర్వహించాయి. డాక్టర్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ (డాట్స్), తెలంగాణ ఇంజనీర్ల జేయేసీ, తెలంగాణ విద్యుత్ ఉద్యోగలు జేయేసీ, టీఎన్జీవోల సంఘం, ఉపాధ్యాయ సంఘాల జేయేసీ, తదితర సంఘాలు అన్ని జిల్లాలలో యాత్రలను నిర్వహించి సకల జనుల సమ్మెకు తమ సంఘీభావాన్ని, భాగస్వామ్యాన్ని ప్రకటించాయి.

వీరితోపాటుగా తెలంగాణ ప్రజా ఫ్రంట్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్, తెలంగాణ భూమి రక్షణ సంఘం లాంటి ఇతర ప్రజాసంఘాలు కూడా సింగరేణి గని కార్మికుల సమ్మెకు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి.


www.eTelangana.org

# సింగరేణి సమ్మె - సీమాంధ్ర మీడియా

జూనియర్ ఎన్టీరామారావు పెళ్లిచీర గురించి, చిరంజీవి కొడుకు రామ్‌చరణ్ పెళ్లి నిశ్చితార్థం సందర్భాన్ని దివారాత్రాలు ఏకధాటిగా ప్రేక్షకులపై రుద్దిన సీమాంధ్ర టెలివిజన్ ఛానెళ్లు, దినపత్రికలు సకల జనుల సమ్మె విషయంలో తమ నిష్పాక్షికతను నిలబెట్టుకోలేకపోయాయి. రాజ్యాంగానికి నాలుగో స్థంభంగానూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు 'వాచ్‌డాగ్' లాగా వ్యవహరించవలసిన మీడియా నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల రాజకీయ డిమాండు విషయంలో 'ఏకపక్ష, స్వీయపక్ష, స్వపక్ష' ధోరణులనే అమలుపరుస్తున్నది. తెలంగాణకు వ్యతిరేకంగానూ, ద్రోహపూరితంగానూ వ్యవహరించడానికి దొరికిన ఏ అవకాశాన్ని కూడా సీమాంధ్ర మీడియా జారవిడుచుకున్న దాఖలాలు బూతద్దంతో వెదికినా కనిపించవు. సకల జనుల సమ్మెలో భాగంగా సింగరేణి గని కార్మికులు 35రోజులపాటు సాగించిన వీరోచితమైన, చరిత్రాత్మకమైన సమ్మె విషయంలో మీడియా అనుసరించిన అత్యంత దుర్మార్గమైన, నీచమైన వైఖరులే ఇందుకు నిదర్శనం.

ఆగస్టు ఒకటో తారీఖునుండి సకల జనుల సమ్మె ప్రారంభమవు తుందని తెలంగాణ జేఏసీ ప్రకటించిన రోజునుండి సీమాంధ్ర మీడియా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ప్రచారాస్త్రాలను సంధించడం మొదలుపెట్టింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో 18రోజులపాటు పాల్గొన్న ఉద్యోగులు సకల జనుల సమ్మె విషయంలో ఆసక్తిగా లేరని, సమ్మె విషయంలో ఉపాధ్య సంఘాల మధ్యన అభిప్రాయబేధాలున్నాయని, ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘాలు సమ్మెను వ్యతిరేకిస్తున్నాయని,



సింగరేణిలో సమ్మె పరిస్థితులు కనిపించడంలేదని ... అనేక రకాలైన వార్తలను సీమాంధ్ర మీడియా గుప్పించింది. సమ్మెకు ప్రతికూలమైన వాతావరణాన్ని నిర్మించడానికి ప్రభుత్వంతోపాటుగా మీడియా అనేక ప్రయత్నాలు చేసింది. అనుకోని కారణాలవల్ల సకల జనుల సమ్మెను తెలంగాణ జేయేసీ రెండుసార్లు వాయిదా వేయాల్సివచ్చింది. సకల జనుల సమ్మె జరిగే పరిస్థితులు లేవని సీమాంధ్ర మీడియా ప్రచారం నిర్వహించింది. 'సకల జనుల సమ్మె' అంటే ఏమిటి? సకల జనులు ఎవ్వరు ? ఈ సమ్మెలో ప్రజలు ఎట్లా భాగస్వాములవుతారు? లాంటి ప్రశ్నలను సీమాంధ్ర మీడియా ఈ సందర్భంగా లేవనెత్తింది.

కానీ అందరి అంచనాలను, అనుమానాలను పటాపంచలు చేస్తూ సెప్టెంబర్ 13వ తేదీనాడు సింగరేణి గని కార్మికులు మోగించిన సమ్మె సైరన్‌తో సకల జనుల సమ్మె ప్రారంభమయ్యింది. అయినా హైదరాబాద్ కేంద్రంలో ఉన్న ఉద్యోగ సంఘాల నాయకులకు మాత్రమే ప్రాధాన్యతను ఇస్తూ, సహాయ నిరాకరణ ఉద్యమంలాగా సకల జనుల సమ్మె కూడా ఉద్యోగవర్గాల సమ్మెగానే చిత్రీకరించేందుకు, పరిమితం చేసేందుకు మీడియా అనేక రూపాలలో ప్రయత్నించింది. అంతర్గత కారణాల రీత్యా ఆర్టీసీ, ఉపాధ్యాయులు సమ్మెలో చేరడంలో కొంత ఆలశ్యం జరిగితే ఈ రెండు వర్గాలు 'సమ్మెకు దూరం' అంటూ సమ్మె చేస్తున్న సింగరేణి కార్మికులను, ఉద్యోగులను నీరుగార్చేందుకు ప్రయత్నించింది. సింగరేణి సమ్మెవల్ల రోజుకు సగటున లక్షా 50వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం జరిగితే ... సీమాంధ్ర మీడియా మాత్రం కొత్తగూడెంలో విధులకు హాజరైన కార్మికుల సంఖ్యలు, అక్కడ ఉత్పత్తి అవుతున్న బొగ్గు గణాంకాలను, సమ్మెలో పాల్గొంటున్న కార్మికులు నష్టపోతున్న వేతనాలను లెక్కగట్టి ప్రతిరోజూ ప్రచారం నిర్వహించింది. సింగరేణి సమ్మె కారణంగా దేశవ్యాపితంగా ఎదురవుతున్న ఇబ్బందులను, కరెంటు కోతలను, విద్యుత్ సంక్షోభానికి సంబంధించిన వివరాలను మాత్రం సీమాంధ్ర మీడియా పట్టించుకోలేదు. బొగ్గు కొరతవల్ల దక్షిణ భారతదేశమంతా అతలాకుతలం అవుతుంటే, వేలాది పరిశ్రమలు విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కుంటుంటే దేశ అంతరంగిక భద్రతకు ముప్పువాటిల్లినట్లుగా ఈ విషయాలను రహస్యంగా దాచిపెట్టింది.



www.eTelangana.org

సమ్మె నడుస్తున్న సమయంలో ఏ ఒక్క సీమాంధ్ర ఛానెల్ కూడా సింగరేణి సమ్మెపై ప్రత్యేక కథనాలను ప్రసారం చేయలేదు. ఏ ఒక్క వర్కింగ్ జర్నలిస్టు కూడా కోల్‌బెల్ట్‌లో పర్యటించలేదు. జాతీయ, అంతర్జాతీయ ఛానళ్లుగానీ, మ్యాగజైన్లుగానీ, పత్రికలుగానీ సింగరేణి సమ్మెకు న్యాయంగా ఇవ్వవలసిన ప్రాధాన్యతను ఇవ్వలేదు. జర్నలిజం విలువలకు, సూత్రాలకు విరుద్ధంగానే వీరు వ్యవహరించారు. ఏ ఒక్క సీమాంధ్ర ఛానెల్ కూడా సింగరేణి సమ్మెమీదగానీ, ఆర్టీసీ సమ్మెమీదగానీ, ఉపాధ్యాయుల సమ్మెమీదగానీ ఏ ఒక్కనాడూ చర్చ నిర్వహించలేదు. సమ్మె విచ్ఛిన్నానికి పనికివచ్చే సందర్భాలను... పరకాల ప్రభాకర్ వితండవాదాన్ని, కార్పోరేటు పాఠశాలల తల్లిదండ్రుల అరువు కేకలను, వగైరా, వగైరాలను ...రోజుల తరబడి ప్రసారం చేసారు. సింగరేణిలో సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వము, సింగరేణి యాజమాన్యం అమలు చేసిన కుట్రలను పెద్దయెత్తున ప్రచారం చేసి, సమ్మె చేస్తున్న కార్మికుల్లో చీలికను తీసుకువచ్చేందుకు సీమాంధ్ర మీడియా శతవిధాలుగా ప్రయత్నాలు చేసింది. ఒకరోజు విధులకు హాజరైతే మూడు మస్టర్లు ఇస్తామని సింగరేణి యాజమాన్యం ప్రకటించిన సందర్భంలోనూ, సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు దసరా పండగకు అడ్వాన్సు, దీపావళి బోనస్ ఇవ్వబోమని యాజమాన్యం అనైతికంగా బెదిరింపులకు దిగిన సందర్భాలోలనూ ప్రముఖంగా ప్రసారం చేసిన సీమాంధ్ర మీడియా సమ్మెకాలంలో కార్మికులు ప్రదర్శించిన పట్టుదలనుగానీ, త్యాగనిరతినిగానీ ఎక్కడా కనీసం ప్రస్తావించలేదు. ఓపెన్‌కాస్ట్ గనుల్లోనుండి ఎట్లాగైనా బొగ్గు ఉత్పత్తిని సాధించాలని యాజమాన్యం మొండిపట్టుదలతో పోలీసు బలగాలను కార్మికుల ఇండ్లకు పంపించి, బలవంతంగా తీసుకువచ్చే ప్రయత్నాలను చేసిన సందర్భాలలో ఆ కాలనీ ప్రజలు, కార్మికుల కుటుంబ సభ్యులు పోలీసులను నిలువరించిన ఆత్మగౌరవ సంఘటనలను సైతం ఏ ఒక్క మీడియా ప్రసారం చేయలేదు. ఉద్యమ వార్తలను జిల్లా టాబ్‌లాయిడ్లకు పరిమితం చేసి, ఉద్యమ విఘాతానికి ఉపయోగపడే వార్తలను మెయిన్ పేజీల్లో ప్రచురించిన ప్రింట్ మీడియా కూడా సింగరేణి పోరాటంపట్ల వివక్షనే ప్రదర్శించింది. తెలంగాణలోని జర్నలిస్టులు ఉద్యమం పట్ల తమకున్న నిబద్ధతను,



నిజాయితీని, తమ పాత్రను, కర్తవ్యాన్ని ఉద్యమంలో స్వయంగా భాగస్వాములవుతూ, ప్రత్యక్ష్యంగా పాల్గొనడానికి సీమాంధ్ర మీడియా తెలంగాణ ఉద్యమంపట్ల అనుసరిస్తున్న వివక్ష పూరిత వైఖరులుకూడా ఒక కారణమే !

## ఉపసంహారం

సుధీర్ఘ సమ్మెల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలువంచి, తమ హక్కులను సాధించుకోవడంలోనూ, సాధించిన హక్కులను అమలు చేయించుకోవడంలోనూ విశేష అనుభవం కలిగిఉన్న సింగరేణి గని కార్మికులు, సింగరేణి గనికార్మికోద్యమ చరిత్రలో మొట్టమొదటిసారి, ఎలాంటి ఒప్పందాలు లేకుండానే 35రోజుల సుధీర్ఘ సమ్మె తర్వాత అక్టోబర్ 18వతేదీనాడు సమ్మెను విరమించవలసివచ్చింది. గోదావరిఖని ఫైవింక్లైన్ బొగ్గుగని నుండి 19వతేదీ ఉదయం శంకర్ అనే గనికార్మికుడు ఇంటినుండి డ్యూటీకి బయలుదేరే ముందు నాతో ఫోన్‌లో తమ ఆవేదనను పంచుకున్నాడు. "సింగరేణిలో ఎప్పుడు సమ్మె జరిగినా సమ్మె విరమణ మరుసటి రోజున ఎంతో గర్వంగా, తలెత్తుకుని తిరిగి బొగ్గుబాయిలోకి దిగేవాళ్లం. కానీ మా జీవితంలో మొట్టమొదటిసారి ఓడిపోయామనే అవమానంతో తలదించుకుని గనిలోకి వెడుతున్నాను. తెలంగాణ సాధించుకోవడానికి ఎన్నిరోజులైనా సమ్మె చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. మీ రెందుకు సార్ ... హఠాత్తుగా సమ్మె విరమించారు !?" నెలరోజులుగా నన్ను వెంటాడుతున్న ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమ్మె నాయకత్వంపై ఎప్పటికైనా ఉన్నది.


www.eTelangana.org



తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా సెప్టెంబర్ 30వతేదీనాడు గోదావరిఖని జేయేసి దీక్షా శిబిరంలో ప్రసంగిస్తున్న వేదిక ప్రధాన కార్యదర్శి పిట్టల రవీందర్.




తెలంగాణ విద్యావంతుల వేదిక అక్టోబర్ 1వతేదీనాడు ఖమ్మం జిల్లా ఇల్లందులో నిర్వహించిన  రోడ్‌షోలో ప్రసంగిస్తున్న వేదిక ఉపాధ్యక్షుడు శ్రీధర్ రావు దేశ్‌పాండే.





తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా సెప్టెంబర్ 30వతేదీనాడు గోదావరిఖని జేయేసి దీక్షా శిబిరంలో సంఘీభావం ప్రకటిస్తున్న వేదిక నాయకులు




తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా సెప్టెంబర్ 30వతేదీనాడు సెంటినరీ కాలనీలో  ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


www.eTelangana.org



తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా సెప్టెంబర్ 30వతేదీనాడు ఆదిలాబాద్ జిల్లా శ్రీరాంపూర్‌లో 30వతేదీనాడు లో జరిగిన బహిరంగసభ దృశ్యం.



తెలంగాణ ద్రోహులను ఎండగట్టడంలో ఉద్యమ శ్రేణులు వినూత్నమైన రీతిలో అనేక పద్ధతులను పాటించారు. శవయాత్రలు, పిండప్రదానాలు, చావుడప్పులు, ఉరితీతలు, దిష్టిబొమ్మల దహనాలు ఉద్యమరోజుల్లో నిత్యకృత్యాలయ్యాయి. వరంగల్లు జిల్లా భూపాలపల్లిలో తెలంగాణ ఉద్యమ మిత్రుడు ప్రకటించిన ఆగ్రహం.





తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా అక్టోబర్ 1వతేదీనాడు కరీంనగర్ జిల్లా యైటింక్లైన్ కాలనీలో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న వేదిక వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోల జనార్ధన్.



తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల సమ్మె సంఘీభావ బస్సుయాత్రలో భాగంగా అక్టోబర్ 1వతేదీనాడు కరీంనగర్ జిల్లా సెంటినరీ కాలనీలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం దృశ్యం.


www.eTelangana.org





సకల జనుల సమ్మెలో 35రోజులపాటు పాల్గొన్న సింగరేణి గని కార్మికులు, గనికార్మికుల కుటుంబాలు తమ సాంస్కృతిక ప్రతీకలను ప్రతిరోజూ తెలంగాణ ఉద్యమంలో భాగం చేసారు. తమ ఉద్యమ చైతన్యాన్ని ప్రతిబింబించారు. సకల జనుల సమ్మె సాగినన్ని రోజులూ కోల్‌బెల్ట్‌లో ఒక పండుగ వాతావరణం వెల్లు విరిసింది. కార్మికులు ప్రతిరోజూ డ్యూటీకి పోయిన విధంగానే సమ్మెలో ఉన్నన్ని రోజులూ ఉద్యమ శిబిరాలవద్ద డ్యూటీకిపోయిన రీతిలోనే తమ ఉనికిని చాటు కున్నారు. సకల జనుల సమ్మె జరిగిన రోజుల్లో కార్మిక వాడలన్నీ ఉద్యమ చైతన్యంతో ఉగ్రూతలూగాయి. కార్మిక కుటుంబాలు సైతం ఊరేగింపులు, ర్యాలీలలో పాల్గొ న్నారు. మానవహారాలు, రాస్తారోకోలు నిత్యకృత్యాలయ్యాయి. తెలంగాణ పల్లె వాతావరణాన్ని, సాంస్కృతిని ఉద్యమంలో నిలబెట్టుకున్నారు. బతుకమ్మలు, బోనాలు, కోలాటాలు ఉద్యమంలో భాగం చేసుకున్నారు. కోల్‌బెల్ట్‌లో ఉపాధికోసం ఆశ్రయం పొందిన కులసంఘాలు, వృత్తికులాలు, బతుకుజీవులు తమ జీవితాన్ని ఉద్యమంలో కలబోసుకున్నారు. తరతరాల తమ కుటుంబ సంస్కృతిని నెమరువేసుకున్నారు. అందుకే సకల జనుల సమ్మె కాలం తెలంగాణ జీవన సదృశ్యంగా విలసిల్లింది.





సకల జనుల సమ్మె రోజుల్లో ,సింగరేణి గని కార్మికులు ఉద్యమ కెరటాలుగా ఉ రకలెత్తారు. ఏ మీటింగు జరిగినా, ఉద్యమానికి మద్దతుగా ఏ ర్యాలీ జరిగినా, ఎవ్వరు ప్రదర్శణ నిర్వహించినా తమ అనుభవాలను కలబోసుకున్నారు. కొందరు కార్మికులైతే బొగ్గుబావుల్లోకి డ్యూకి హాజరైనట్లుగానే తట్టాచెమ్మాసులను మోసుకుని ఆందోళనా కార్యక్రమాలకు హాజరయ్యారు. అందుకే సమ్మెకాలంలో కోల్‌బెల్ట్‌లో జరిగిన బహిరంగసభలన్నీ కార్మికులతో కిక్కిరిసిపోయాయి. సమ్మె వెసులుబాటును తమ స్వంత పనులకోసం కాకుండా ఉద్యమాన్ని ఉగ్రూతలూగించేందుకే ఉపయోగించారు.



సకల జనుల సమ్మెకాలంలో సమ్మెకు అనుబంధంగా తెలంగాణ జేయేసి అనేక ఆందోళనా కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. సమ్మెలో పాల్గొంటున్న సింగరేణి గని కార్మికులకు ఆలంబనగా స్థానిక జేయేసి కమిటీలు ఆ కార్యక్రమాలలో పౌరసమాజాన్ని భాగస్వాములను చేసింది. రైల్‌రోకో కార్యక్రమంలో ఉద్యమ చైతన్యాన్ని ప్రదర్శిస్తున్న రామగుండం ప్రాంత ఉద్యమ శ్రేణులు.



www.eTelangana.org

**IN THE COURT OF THE SUB-DIVISIONAL MAGISTRATE & REVENUE DIVISIONAL OFFICER, KOTHAGUDEM**
**PRESENT : Dr. G. Dharma Rao, Ph.D.,**

Rc. No. D/963/2011 Dt. 09-10-2011

**PROMULGATION OF ORDER U/S. 144 Cr.P.C.**

It appears to me that the Sub Divisional Police Officer, Kothagudem filed requisition vide C.No. /SDPO-KGM/11, dt. 08.10.2011, for promulgation of orders u/s. 144 Cr.P.C. for (3) days from 09-10-2011 to 11-10-2011 to prevent the entry of Mr. **Pittala Ravinder**, T.Rajeswara Rao ex-major and their associates from entering into Enkoor, **Julurpad, Chandrugonda** and Kothagudem Mandal areas, as they are planning to come to Kothagudem to visit mines and prevent the loyal workers of Singareni from attending their duties with an intention to stop the production in connection with Sakala Janula Samme, and there is every chance of loyal employees revolting against Pittala Ravinder, T.Rajeswara Rao, Ex Mayor and their associates and thereby a friction between them which will result in breach of peace and tranquility and may result into law and order disturbance.

In view of the above, I, Dr. G. Dharma Rao, Sub-Divisional Magistrate, Kothagudem, in accordance with the powers confirmed on me, do hereby promulgate prohibitory orders U/s. 144 Cr. P.C. for (3) days from 09-10-2011 to 11-10-2011 to prevent the entry of Mr. Pittala Ravinder, T.Rajeswara Rao ex-major and their associates in Enkoor, Julurpad, Chandrugonda and Kothagudem Mandal areas which fall within my jurisdiction so as to maintain peace and tranquility, prohibiting the gathering of more than 4 or 5 members in the said area and prohibit the wearing of lotties, weapons and conduct of meetings during the said period.

The respective Tahsildars are directed to be physically available at their respective headquarters on 9th, 10th and 11th October 2011 and be in touch with concerned Police to maintain law and order and public tranquility.

These orders come into force with immediate effect from 09-10-2011.

Given under my hand & seal of this Court on this the 9th day of October, 2011.

Sub-Divisional Magistrate &
Revenue Divisional Officer,
Kothagudem.

Copy to the Sub-Divisional Police Officer, Kothagudem for necessary action.
Copy submitted to the Collector & District Magistrate, Khammam for kind information.

అక్టోబర్ 9వతేదీన హైదరాబాద్ నుండి సింగరేణి యాత్రకోసం బయలుదేరిన కోదండరామ్ బృందాన్ని అలేరువద్ద అరెస్టు చేయడంతో, ఎట్లాగైనా ఈయాత్రను విజయవంతం చేయాలనే పట్టుదలతో నేను (పిట్టల రవీందర్), బిజెపి ఉద్యమ కమిటీ ఛైర్మెన్ డాక్టర్ టి. రాజేశ్వర్‌రావుతోపాటు ఇతర మిత్రులము రాత్రి సుమారు 10గంటలకు కొత్తగూడెం చేరుకున్నాము. అక్కడ మీడియాతోనూ, కార్మికులతోనూ మాట్లాడుతున్న సమయంలోనే స్థానిక పోలీసు అధికారులు పోలీసు బృందాలతో వచ్చి మమ్మల్ని అరెస్టు చేసేందుకు విఫల యత్నం చేసారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకత్వంలో ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించారు. మమ్మల్ని అరెస్టు చేయడానికి కారణమేమిటని ప్రశ్నించడంతో, తిరిగి అర్ధరాత్రి 12.30గంటలకు నిషేధఉత్తర్వులు పట్టుకుని మమ్మల్ని అరెస్టు చేయడానికి పోలీసు అధికారులు వచ్చారు. కొత్తగూడెం డివిజన్‌లో మూడురోజులపాటు అడుగు పెట్టకుండా ప్రభుత్వం నిషేధపు ఉత్తర్వులను వెలువరించడం ఇదే మొదటిసారి.





అక్టోబర్ 9వ తేదీ అర్ధరాత్రి కొత్తగూడెం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు



సెప్టెంబర్ 30 వ తేది రాత్రి భూపాలపల్లి చేరుకున్న తెలంగాణా విద్యావంతుల వేదిక " సంఘీభావ బస్సుయాత్ర "

www.eTelangana.org